http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

ఆదివారం 6 సెప్టెంబర్ 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5    వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.
ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

- అధికారులకు కీలక సూచనలు చేసిన స్పీకర్, ఛైర్మన్
- అసెంబ్లీ సమావేశాల నిర్వహణ, వసతులపై స్పీకర్, మండలి ఛైర్మన్ ఆధ్వర్యంలో సమావేశం
- సభ్యులు కోరిన సమాచారం త్వరగా అందించాలని స్పీకర్ ఆదేశం – భద్రతా ఏర్పాట్లపై ఆరా
- సభలో ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు



హైదరాబాద్

సోమవారం నుంచి తెలంగాణ అసెంబ్లీ, శాసనమండలి వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సభ లోపల, బయట ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశించారు. సభ్యులు కోరిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని అధికారులకు సూచించారు. సమావేశాల నిర్వహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్? కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి శాసన వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ అధికారులు, డీజీపీ, పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు. గత సమావేశాల కంటే వేగంగా, - మిగతా3లో



## డ్రగ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

- ‘మొబైల్ వినియోగానికి క్రీడలే పరిష్కారం’
- ‘విద్యార్థుల్లో డ్రగ్స్, స్క్రీన్ టైం విషయంలో అప్రమత్తంగా ఉండాలి’
- ఉపాధ్యాయులకు ప్రధాని మోదీ సూచన
- విద్యార్థుల్లో మాదకద్రవ్యాల వినియోగంపై ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని ప్రధాని మోదీ సూచన
- పిల్లలు మొబైల్ ఫోన్లకు బానిస కాకుండా క్రీడల వైపు మళ్లించాలని పిలుపు

## ఇక సిరిసిల్ల, సిద్ధిపేటలపై దండయాత్రే

- సీట్లు పెరిగితే 117, ఇప్పుడున్నవే అయితే 90 గెలుస్తాం
- వచ్చేసారి కూడా తెలంగాణలో ఇందిరమ్మ పాలన వస్తుంది.
- వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వమే
- నకిరేకల్‌లో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ శ్రీకారం
- రూ.32 కోట్లతో నిర్మించిన 100 పడకల ఆస్పత్రిని ప్రారంభించిన సీఎం
- నకిరేకల్‌లోని రాజీవ్‌గాంధీ మినీ స్టేడియంలో బహిరంగ సభలో పాల్గొన్న రేవంత్
- ప్రజాపాలన పోవాలి పాపాల భైరవుడు రావాలి అని వాళ్లు కోరుకుంటున్నారు
- తమ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం



హైదరాబాద్

ఏ విషయంపైనైనా చర్చించేందుకు తాను సిద్ధమన్న సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీకి రావాలని బీఆర్?ఎస్ అధినేత కేసీఆర్‌కు సవాల్ విసిరారు. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభించిన అనంతరం, స్థానిక రాజీవ్‌గాంధీ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఏడాదిపాటు రాకపోతే తొలగిస్తామని, వెయ్యి రోజుల్లో కేసీఆర్‌కు రూ.22 కోట్లు ఖర్చయ్యిందని, ప్రభుత్వ సొమ్ము తీసుకొని అసెంబ్లీకి రావట్లేదని అన్నారు. ప్రజల సొమ్ము తిని ప్రజా సమస్యలు ప్రస్తావించరా? అని నిలదీశారు. బీఆర్ఎస్ అనే మొక్కను తెలంగాణలో మొలకెత్తనివ్వమని, సిరిసిల్ల, సిద్దిపేటలోనూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ‘ఈ నెలఖరుకు వస్తా, సిరిసిల్లపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా, వచ్చే నెలలో సిద్దిపేటకు వస్తా, కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా?, సీట్లు పెరిగితే 117 సీట్లు గెలుస్తాం, ఇప్పుడున్న సీట్లే ఉంటే 90 సీట్లు గెలుస్తాం’ అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాపాలన పోవాలి - మిగతా3లో



## ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో కీలక మార్పులు

- పలు రాష్ట్రాలకు కొత్త ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌ల నియామకం
- పలు రాష్ట్రాలకు కొత్త ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌లను నియమించిన కాంగ్రెస్ అధిష్ఠానం
- ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యులుగా పీవీ మోహన్ నియామకం
- ఆదేశాలు జారీ చేసిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్



## అసెంబ్లీ ఎన్నికల వేళ 4 రాష్ట్రాల్లో జనగణన

- ఈ డిసెంబర్ 1 నుంచే షురూ!
- ఉత్తరాఖండ్, గోవా, ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్‌లో జనగణన షెడ్యూల్ రిలీజ్
- 2026 డిసెంబర్ 1 నుంచి 2027 జనవరి 4 వరకు నిర్వహణ
- వచ్చే ఏడాదే 4 రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు



## మీడియా రంగం విశ్వసనీయత కోల్పోతోంది

- నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు
- ప్రజాస్వామ్యానికి మీడియా, న్యాయవ్యవస్థ కీలకం
- మీడియా రంగంలో విశ్వసనీయత సంక్షోభం సమస్య మరింత తీవ్రమైంది
- ప్రజాస్వామ్య పురోగతికి స్వతంత్ర మీడియా ఎంతో ముఖ్యం
- ప్రజలు, సమాజం కోసం పనిచేస్తే క్రెడిబిలిటీ తిరిగి సాధించొచ్చని సూచనలు

## ఫ్యూచర్ సిటీలో మెగా ప్రాజెక్ట్



- తెలంగాణకు భారీ డేటా సెంటర్.. రూ.70 వేల కోట్ల పెట్టుబడి!
- 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్లు
- తెలంగాణ ప్రభుత్వం, టీసీఎస్, హైపర్ వాల్ట్ ప్రతినిధుల మధ్య అవగాహన ఒప్పందం
- తెలంగాణలో ఓపెన్ ఏఐకు అతిపెద్ద డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసే దిశగా ఈ ప్రాజెక్టు కీలకం
- తెలంగాణను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడంలో.. భారీ పెట్టుబడులు కీలక పాత్ర పోషిస్తాయి
- టాటా, టీసీఎస్, హైపర్ వాల్ట్ వంటి సంస్థల భారీ పెట్టుబడులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తాయి

హైదరాబాద్

తెలంగాణలో భారీ పెట్టుబడులకు మరో అడుగు పడింది. దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్లలో ఒకటిగా నిలిచే ప్రాజెక్టును రాష్ట్రానికి తీసుకురావడానికి ప్రభుత్వం కీలక ఒప్పందం చేసుకుంది. సుమారు రూ.70 వేల కోట్ల పెట్టుబడితో.. 1 గిగావాట్ సామర్థ్యంతో డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. హైదరాబాద్ సమీపంలోని.. కొంగరకలాన్ ఫ్యూచర్ సిటీలో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమక్షంలో.. తెలంగాణ ప్రభుత్వం, టీసీఎస్, హైపర్ వాల్ట్ ప్రతినిధుల మధ్య అవగాహన ఒప్పందం - మిగతా3లో




## కేబినెట్ విస్తరణ ఇప్పట్లో లేనట్లే

- ఢిల్లీలో కేబినెట్ విస్తరణపై చర్చ జరగలేదు
- కేవలం కొండా సురేఖ, చిన్నా రెడ్డి అంశంపై మాత్రమే చర్చ జరిగింది
- కేబినెట్ విస్తరణపై హై కమాండ్ నుండి ఎలాంటి సమాచారం లేదు
- మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు చేయాలనేది సీఎం రేవంత్ రెడ్డి ఇష్టం

సురేఖ ఎపిసోడ్, కేబినెట్ విస్తరణపై మహేష్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్

తెలంగాణలో కేబినెట్ విస్తరణ అంశం, కొండా సురేఖ ఎపిసోడ్‌పై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సురేఖను కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించినట్టు ఆయన చెప్పుకొచ్చారు. అలాగే, కేబినెట్ విస్తరణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇష్టానుసారం జరుగుతుందని తెలిపారు. మీడియా చిట్ చాట్‌లో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ‘కేబినెట్ విస్తరణ ఇప్పట్లో లేనట్లే. ఢిల్లీలో కేబినెట్ విస్తరణపై చర్చ జరగలేదు. కేవలం కొండా సురేఖ, చిన్నా రెడ్డి అంశంపై మాత్రమే చర్చ జరిగింది. కేబినెట్ విస్తరణపై హై కమాండ్ నుండి - మిగతా3లో

# ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో కీలక మార్పులు

సంస్థాగతంగా మరింత బలోపేతం అయ్యేందుకు కాంగ్రెస్ పార్టీ కీలక మార్పులు చేసింది. దేశంలోని పలు రాష్ట్రాలకు కొత్త ఏఐసీసీ (ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ) ఇన్‌ఛార్జ్‌లను నియమించింది. ఆంధ్రప్రదేశ్ ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌గా పీవీ మోహన్‌ను కాంగ్రెస్ అధిష్టానం నియమించింది. మాణికం ఠాకూర్ తమిళనాడుకు వెళ్లడంతో ఆంధ్రప్రదేశ్ ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ పదవి ఖాళీ అయింది. దీంతో ఆ స్థానంలో మోహన్‌ను ఎంపిక చేసింది. మరోవైపు వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న పంజాబ్ రాష్ట్రానికి కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ జనరల్ సెక్రటరీగా రాజస్థాన్ కాంగ్రెస్ నాయకుడు సచిన్ పైలట్‌ను నియమించింది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ ఆదేశాలు జారీ చేశారు. కొత్త నియామకాలు తక్షణమే అమల్లోకి వచ్చేలా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నియమించారని స్పష్టం చేశారు. ఇదే సమయంలో ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యులుగా సుఖ్‌దేవ్ భగత్‌ను ఎంపిక చేశారు. మరికొందరిని ఇటీవల కాలంలో పార్టీ బాధ్యులుగా నియమించినట్లు కాంగ్రెస్ ప్రకటనలో పేర్కొంది. పంజాబ్ రాష్ట్రంలో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా ఇక్కడ కాంగ్రెస్ ఎక్కువ ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. పంజాబ్ శాసనసభ గడువు 2027 మార్చి 16తో ముగియనుండగా, ఆలోపే అంటే వచ్చే ఏడాది ప్రారంభంలోనే ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. దీంతో ముందుగానే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని పుంజుకునేలా చేసేందుకు, వ్యూహాలు రచించడానికి సీనియర్ నేత సచిన్ పైలట్‌ను ఏఐసీసీ వ్యవహారాల బాధ్యులుగా నియమించింది. ప్రస్తుతం పంజాబ్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్‌కు ఉద్వాసన ఎదురైంది. ఇప్పుడు సచిన్ పైలట్ పంజాబ్ కాంగ్రెస్ బాధ్యతలు చూసుకోనుండగా, బఘేల్‌ను అసోం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్‌గా నియమించింది. సచిన్ పైలట్ విషయానికి వస్తే ఈయన పార్టీలో కీలక నాయకుల్లో ఒకరు. గతంలో రాజస్థాన్‌కు ఉపముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది. ఇంకా రాజస్థాన్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా కూడా ఉన్నారు. వివిధ మంత్రిత్వ శాఖల్లో పనిచేశారు. ప్రస్తుతం పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలో ఉంది.



మరోవైపు గుజరాత్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ జనరల్ సెక్రటరీగా సీనియర్ నాయకుడు రణదీప్ సింగ్ సుర్జేవాలాను పార్టీ నియమించింది. గుజరాత్‌లో వచ్చే ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడ దాదాపు 30 ఏళ్లుగా కాంగ్రెస్ అధికారానికి దూరంగా ఉంది. ఇక్కడ తిరిగి పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ఆయన కృషి చేయాల్సి ఉంటుంది. ఇటీవలే అధికార మార్పిడి జరిగిన కర్ణాటకలోనూ ఏఐసీసీ వ్యవహారాల బాధ్యతలను రణదీప్ సుర్జేవాలా చూసుకోనున్నారు. సిరివెల్ల ప్రసాద్‌ను మహారాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. ఇక ఇప్పటివరకు పార్టీ జనరల్ సెక్రటరీ/ఇన్‌ఛార్జ్‌లుగా పనిచేసి, బాధ్యతల నుంచి తప్పుకుంటున్న జితేంద్ర సింగ్, రమేశ్ చెన్నితాల, మాణికం ఠాకూర్‌ల సేవలను పార్టీ అభినందిస్తోందని వేణుగోపాల్ అన్నారు. మరోవైపు ఏఐసీసీ జనరల్ సెక్రటరీగా ముకుల్ వాస్నిక్ కొనసాగుతారని ప్రకటనలో కాంగ్రెస్ పేర్కొంది.

**కొత్త ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌లు వీరే**

ఆంధ్రప్రదేశ్– పీవీ మోహన్
పంజాబ్– సచిన్ పైలట్
అసోం– భూపేశ్ బఘేల్ (ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి)
మహారాష్ట్ర– సిరివెల్ల ప్రసాద్
గుజరాత్– రణ్‌దీప్ సుర్జేవాలా
ఉత్తర్‌ప్రదేశ్– రాజేంద్ర పాల్ గౌతమ్
హరియాణా– సంజయ్ దత్ (2026 జూన్‌లో నియామకం)
ఒడిశా– లాల్జీ దేశాయ్ (2026 జూన్‌లోనే నియామకం)
తమిళనాడు– గులామ్ అహ్మద్ మీర్ (2026 జులైలో నియామకం)
బంగాల్– ప్రకాశ్ జోషి (2026 జులైలో నియామకం)

రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సహా అదే విధంగా ఆయా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ అధిష్టానం సంస్థాగతంగా మార్పులు చేస్తున్నట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు. పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడం సహా పార్టీ కేడర్‌ను సమన్వయం చేయడం, ఆయా రాష్ట్రాల నాయకత్వంతో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను దూకుడుగా ముందుకు తీసుకెళ్లడం, ఎన్నికల వేళ వ్యూహాల్ని అమలు చేయడం వంటి పలు అంశాలపై పార్టీ ఇన్‌ఛార్జ్‌లు దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

# అసెంబ్లీ ఎన్నికల వేళ 4 రాష్ట్రాల్లో జనగణన

కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది ఉత్తరాఖండ్, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, గోవాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఈ రాష్ట్రాల్లో జనగణన ప్రక్రియను కాస్త ముందుగానే నిర్వహించాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి తాజాగా షెడ్యూల్ విడుదల చేసింది. ఈ ఏడాది డిసెంబర్ 1న జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఇది వచ్చే ఏడాది అంటే 2027 జనవరి 4 వరకు కొనసాగుతుంది. ఈ జనాభా గణనకు సంబంధించిన వివరాల్ని భారత రిజిస్ట్రార్ జనరల్ (=+× – రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా), సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ తాజాగా విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ 4 రాష్ట్రాల్లోని ప్రజలు ముందుగానే వారి వివరాల్ని నమోదు చేసుకునేందుకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) సౌకర్యాన్ని కల్పించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ స్వీయ గణన ఆప్షన్ జనగణన అధికారిక ప్రక్రియ ప్రారంభమయ్యే ముందు 15 రోజులు అంటే 2026 నవంబర్ 16 నుంచి 30వ తేదీ వరకు అవకాశం ఉంటుందని నారాయణ్ తెలిపారు. 2027 జనవరి 5 నుంచి 9 వరకు దీనికి సంబంధించి రివిజనల్ రౌండ్ నిర్వహిస్తామన్నారు. ఈ రివిజనల్ రౌండ్‌లో సవరణలకు అవకాశం ఉంటుందన్నమాట. ఇక్కడ అవసరమైన మార్పులు లేదా ధ్రువీకరణ ప్రక్రియలు వంటివి నిర్వహించే అవకాశం ఉంటుంది. ఉత్తరాఖండ్‌లో మంచుతో కప్పి ఉండే ప్రాంతాల్లో మాత్రం పైన షెడ్యూల్ ప్రకారం జన గణన ప్రక్రియ ఉండదని నారాయణ్ స్పష్టం చేశారు.

ఈ నోటిఫికేషన్ ప్రకారం ఉత్తరాఖండ్ మంచు ప్రాంతాలు మినహా ఈ నాలుగు రాష్ట్రాల్లో 2027 జనగణనకు (సెన్సస్ 2027) రిఫరెన్స్ డేట్‌గా 2027, జనవరి 5 అర్ధరాత్రి 12 గంటలుగా (00:00 ఎతీం) నిర్ణయించారు. అంటే ఈ తేదీ, సమయాలను ప్రామాణికంగా తీసుకొని ఆ లోపే జనగణన ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. మరోవైపు లద్దాఖ్ సహా మంచుతో కప్పి ఉండి రవాణాకు అనుకూలించని జమ్ముకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతం, అలాగే మంచుతో కప్పబడి ఉండే హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని కొన్ని ప్రాంతాలకు జనగణనకు రిఫరెన్స్ డేట్‌ను 2026, అక్టోబర్ 1గా నిర్ణయించారు. అంటే ఈ ప్రాంతాల్లో ముందుగానే సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు జనగణన నిర్వహించనున్నట్లు గత నెలలో =+× గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆగస్ట్ 17– 31 మధ్య ఇక్కడ సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియ జరిగింది. ఈ ప్రాంతాల్లో శీతాకాలంలో పరిస్థితులు అనుకూలించని కారణంగా ముందుకు జరిపారు. ఈ ప్రాంతాల్లోని ప్రత్యేక భౌగోళిక వాతావరణ పరిస్థితుల నేపథ్యంలోనే ఇతర సాధారణ ప్రాంతాలతో కలిపి ఒకేసారి జనాభా లెక్కలు నిర్వహించడం కష్టం కావడంతో ప్రత్యేక షెడ్యూల్ రూపొందించారు.



కేంద్ర ప్రభుత్వం గతంలో 2025 జూన్ నెలలో విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం– పైన చెప్పిన మంచుతో కప్పబడి ఉండే ప్రాంతాలకు మినహాయించి దేశంలోని మిగతా అన్ని ప్రాంతాలకు 2027 మార్చి 1 ని రిఫరెన్స్ డేట్‌గా నిర్ణయించింది. ఇక గోవా, మణిపూర్, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల శాసనసభల గడువు 2027 మే నాటికి ముగుస్తుంది. అంటే ఆలోపే ఎన్నికలు నిర్వహించాల్సి వస్తుంది. తీరా ఎన్నికల వేళ జనగణన నిర్వహిస్తే పెద్ద సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ ఉపాధ్యాయుల్ని మోహరించడం కష్టమని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఈ రాష్ట్రాల్లో సెన్సస్ ప్రక్రియను ముందుకు జరిపారు. ఇవి కాకుండా దేశంలోని మిగతా రాష్ట్రాల్లో జనాభా గణన ప్రక్రియ వచ్చే ఏడాది ఫిబ్రవరిలోనే ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ జనగణన ప్రక్రియలో కుటుంబంలోని వ్యక్తులకు సంబంధించిన వివరాలు సహా పలు సామాజిక, ఆర్థిక వివరాల్ని అధికారులు సేకరిస్తారు.

**కొవిడ్ వ్యాప్తి కారణంగా వాయిదా**

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎనిమిదో సారి జనగణన నిర్వహిస్తుండగా, ఈ ప్రక్రియ రెండు దశల్లో జరుగుతుంది. ఫస్ట్ ఫేజ్‌లో ఇళ్ల జాబితా, గణన ఉంటుంది. రెండో దశలో జనాభా లెక్కల్ని సేకరిస్తారు. ప్రస్తుత 2027 జనగణన ప్రక్రియ 2021లోనే జరగాల్సి ఉన్నప్పటికీ కొవిడ్–19 వ్యాప్తి కారణంగా ఇది వాయిదాపడింది. ఈ సెన్సస్ ప్రక్రియ నిర్వహణ కోసం కేంద్రం భారీగా ఖర్చు చేస్తోంది. ఏకంగా రూ. 11,718 కోట్ల విడుదలకు కేంద్ర కేబినెట్ ఆమోదించింది.

# మీడియా రంగం విశ్వసనీయత కోల్పోతోంది

ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. అయితే ప్రస్తుతం విశ్వసనీయత సంక్షోభం మీడియా రంగం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యగా మారిందని వ్యాఖ్యానించారు. అన్ని రంగాల్లోనూ క్రెడిబిలిటీ తగ్గుతున్నప్పటికీ, మీడియా రంగంలోనే ఈ సమస్య మరింత తీవ్రంగా కనిపిస్తోందని స్పష్టం చేశారు. నాగ్‌పూర్‌లో జరిగిన ఐఐఎం నాగ్‌పూర్ మీడియా కాన్‌క్లేవ్ 2026లో 'మీడియా, లీడర్‌షిప్ అండ్ ది న్యూ వరల్డ్ ఆర్డర్' అనే థీమ్‌తో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఎడిటర్ ఇన్ చీఫ్ విజయ్ జోషి, బిజినెస్ స్టాండర్డ్ ఎడిటోరియల్ డైరెక్టర్ ఏకే భట్టాచార్య, బ్లిట్జ్ ఇండియా మీడియా గ్రూప్ ఛైర్మన్, ఎడిటర్ ఇన్ చీఫ్ దీపక్ ద్వివేది తదితరులు హాజరయ్యారు. భారత్ ప్రజాస్వామ్యానికి తల్లి లాంటిదని, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని గడ్కరీ అన్నారు. ప్రజాస్వామ్యంలో మంచి మార్పు రావాలంటే దాని కీలక వ్యవస్థలు సమర్థంగా పనిచేయాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్యంలోని నాలుగు స్తంభాలైన శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థ, మీడియా తమ బాధ్యతల్ని చక్కగా నిర్వర్తించాలి. ప్రజాస్వామ్యం పురోగతికి, అభివృద్ధికి స్వతంత్ర, నిష్పక్షపాత న్యాయవ్యవస్థతో పాటు స్వతంత్ర మీడియా కూడా అవసరమని అప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని గడ్కరీ పేర్కొన్నారు.

**రాజకీయాల్లో భిన్నాభిప్రాయాలు సహజమే**

ప్రజాస్వామ్యానికి రాజకీయాలు, రాజకీయ పార్టీలు అతిపెద్ద బలమని కేంద్ర మంత్రి తెలిపారు. అయితే రాజకీయాల్లో అభిప్రాయ భేదాలు, సిద్ధాంతపరమైన విభేదాలు ఉండటం సహజమేనని గడ్కరీ చెప్పారు. 'ఒక వ్యక్తి లేదా పార్టీ తాను నమ్మిన సిద్ధాంతం పట్ల నిబద్ధతతో ఉండాలి. ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి సామాజిక, ఆర్థిక, విద్య సహా పలు అంశాలపై ప్రజల్లో అవగాహన పెంచడం కూడా అవసరమే. ప్రజలకు ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన ఉండటంతో పాటు వాటి పట్ల నిబద్ధత కలిగి ఉండటం కూడా చాలా ముఖ్యం' అని గడ్కరీ స్పష్టం చేశారు.



**మీడియా క్రెడిబిలిటీనే బాగా పడిపోయింది**

21వ శతాబ్దంలో ఏ రంగానికైనా విశ్వసనీయత, మంచి పేరు (గుడ్‌విల్), నిజాయతీనే అతిపెద్ద పెట్టుబడులు అని గడ్కరీ పేర్కొన్నారు. అన్ని రంగాల్లో క్రెడిబిలిటీ కొంత తగ్గిందని, కానీ మీడియాలో మాత్రం విశ్వసనీయత చాలా ఎక్కువగా పడిపోయిందని ఆయన వ్యాఖ్యానించారు. అయితే ఇక్కడ అన్ని మీడియా సంస్థలు తమ విశ్వసనీయత కోల్పోయాయని తాను చెప్పట్లేదని స్పష్టం చేశారు. మీడియా తన విశ్వసనీయతను తిరిగి ఎలా సాధించాలనే దానిపై ఆలోచించాల్సిన అవసరం ఉందని గడ్కరీ సూచించారు. గతంలో కొన్ని పత్రికలు సహా మీడియా సంస్థలు ఎన్నికల్లో ఎవరు గెలుస్తారో తామే నిర్ణయించగలమన్న స్థాయిలో మాట్లాడేవని గడ్కరీ తన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. అయితే సోషల్ మీడియా రాకతో పరిస్థితి పూర్తిగా మారి పోయిందని అన్నారు. మీడియాతో పాటు రాజకీయాల్లో కూడా విశ్వసనీయత సంక్షోభం ఉందని పేర్కొన్న గడ్కరీ, అన్ని రంగా ల్లోనూ సమస్య ఉన్నప్పటికీ మీడియా రంగంలో క్రెడిబిలిటీ సంక్షోభమే అతిపెద్ద సమస్య అని అభిప్రాయపడ్డారు. అందుకే దీనిని తిరిగి తెచ్చుకునేందుకు జర్నలిస్టులు ప్రజలు, సమాజం, దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వార్తలు రాయాలని గడ్కరీ సూచించారు. జర్నలిజంలో నాణ్యతతో పాటు వృత్తి విలువలను కాపాడుకోవాలని అన్నారు. రాబోయే రోజుల్లో తమ విశ్వసనీయతను కాపాడుకుంటూ, వృత్తి ప్రాథమిక విలువలను గౌరవించే మీడియా సంస్థలు, జర్నలిస్టులే నిలదొక్కుకుంటారని గడ్కరీ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం, సామాజిక న్యాయం, జాతీయ ప్రయోజనాలను కాపాడటం, ప్రజలకు వాస్తవ సమాచారం చేరవేయడం వంటి అంశాలపై మీడియా దృష్టి పెట్టాలని సూచించారు. ఇవన్నీ భారత్‌ను విశ్వగురుగా ఎదిగేందుకు దోహదపడతాయని గడ్కరీ ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాట్లాడిన ఐఐఎం నాగ్‌పూర్ డైరెక్టర్ డాక్టర్ భీమరాయ మెట్రి– దేశ అభివృద్ధిలో నేటి యువత కీలక పాత్ర పోషించనుందని అన్నారు.

## డ్రగ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

విద్యార్థుల్లో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం, అధిక స్క్రీన్ టైమ్‌పై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. పిల్లలను కేవలం చదువులోనే కాకుండా వారి ప్రవర్తన, రోజువారీ జీవితం, ఆసక్తులు, అలవాట్ల పరంగా కూడా గమనించాలని చెప్పారు. క్రీడలు, శారీరక ఆటలు, సృజనాత్మక కార్యక్రమాల ద్వారా పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని సూచించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జాతీయ అవార్డులకు ఎంపికైన ఉపాధ్యాయులతో ప్రధాని మోదీ శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పిల్లల భవిష్యత్తు, విద్యా విధానం, డ్రగ్స్, స్క్రీన్ టైమ్ వంటి అంశాలపై వారితో చర్చించారు. ఈ భేటీకి సంబంధించిన వీడియోను శనివారం విడుదల చేశారు. "ఉపాధ్యాయులు పుస్తకాలు, సిలబస్‌కే పరిమితం కాకుండా విద్యార్థుల జీవితాల్లో భాగం కావాలి. పిల్లల్లో సహజంగా ఉండే ఆసక్తి, తెలుసుకోవాలనే కుతూహలాన్ని గుర్తించి దాన్ని సరైన దిశలో మళ్లించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది. పిల్లల బాల్యాన్ని కోల్పోకుండా చూడటం ఉపాధ్యాయులు చేయగలిగే అతిపెద్ద సేవ. తరగతి గదిలో పాఠాలను మరింత ఆసక్తికరంగా మార్చేందుకు సృజనాత్మక పద్ధతులను అనుసరించాలి. విద్యార్థుల అకడమిక్ పనితీరును మాత్రమే ప్రామాణికంగా తీసుకోకూడదు. పిల్లల ప్రవర్తనలో ఏవైనా అసాధారణ మార్పులు కనిపిస్తున్నాయా? వారి రోజువారీ జీవితం ఎలా ఉంది? అనే విషయాలను ఉపాధ్యాయులు నిశితంగా గమనించాలి. గతంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో పిల్లలపై తల్లిదండ్రులతో పాటు ఇతర కుటుంబసభ్యుల పర్యవేక్షణ కూడా ఉండేది. ప్రస్తుతం ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోతున్న నేపథ్యంలో విద్యార్థుల జీవితాల్లో ఉపాధ్యాయుల పాత్ర మరింత పెరిగింది."

**డ్రగ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి**

కొన్ని పెద్ద నగరాలు, విశ్వవిద్యాలయాల్లో మాదకద్రవ్యాల సమస్యను గుర్తించడం కష్టంగా మారుతోందని మోదీ అన్నారు. ఎవరు ఎవరికి ఏం ఇస్తున్నారో తెలుసుకోవడం కూడా కష్టమైన పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధ్యాయులే డ్రగ్స్ దుష్ప్రభావాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ముందుకు రావాలని సూచించారు. అదే సమయంలో ఏ విద్యార్థి ప్రవర్తనలోనైనా ఆకస్మిక మార్పులు కనిపిస్తే వాటిని నిర్లక్ష్యం చేయకుండా నిశితంగా పరిశీలించాలని చెప్పారు.

**'మొబైల్ వినియోగానికి క్రీడలే పరిష్కారం'**

విద్యార్థుల్లో అధిక స్క్రీన్ టైమ్ మరో ప్రధాన సమస్యగా మారిందని ప్రధాని పేర్కొన్నారు. పిల్లలు రోజులో ఎంతసేపు మొబైల్, ఇతర స్క్రీన్లను చూస్తున్నారు? రాత్రివేళల్లోనూ ఫోన్లు ఉపయోగిస్తున్నారా? అనే విషయాలను తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు చర్చించాలని సూచించారు. స్క్రీన్ టైమ్‌ను తగ్గించేందుకు కేవలం ఆంక్షలు విధించడం కంటే పిల్లల్లో క్రీడలు, శారీరక ఆటలు, సృజనాత్మక కార్యకలాపాలపై ఆసక్తి పెంచడం ద్వారా సహజంగానే మొబైల్ వినియోగాన్ని తగ్గించవచ్చని మోదీ అన్నారు. జాతీయ విద్యా విధానం (ఎన్?ఈపీ)ను ప్రస్తావించిన ప్రధాని పిల్లలను తరగతి గదికే పరిమితం చేయకూడదని అన్నారు. నిజ జీవిత నైపుణ్యాలు, వివిధ రకాల పనులు, సమాజంతో వారికి పరిచయం కల్పించాలని సూచించారు. విద్య కేవలం పుస్తకాల్లోని విషయాలకు పరిమితం కాకుండా జీవితాన్ని అర్థం చేసుకునేలా ఉండాలని పేర్కొన్నారు.

**మహిళల్లో క్యాన్సర్ అవగాహనపై ప్రశంస**

తన పరిసర ప్రాంతాల్లో మహిళలకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న ఓ ఉపాధ్యాయురాలి ప్రయత్నాన్ని ప్రధాని ప్రత్యేకంగా ప్రశంసించారు. తన లోక్‌సభ నియోజకవర్గమైన వారణాసిలో తాను రొమ్ము క్యాన్సర్ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. ఎక్కువ మంది మహిళలు స్క్రీనింగ్ కోసం ముందుకు వస్తున్నారని, ఈ కార్యక్రమంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు కూడా నమోదైనట్లు మోదీ తెలిపారు.

**82 మంది ఉపాధ్యాయులకు జాతీయ పురస్కారాలు**

ఈ ఏడాది జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలకు మొత్తం 82 మంది ఉపాధ్యాయులు, విద్యావేత్తలు ఎంపికయ్యారు. ఇందులో పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం నుంచి 48 మంది, ఉన్నత విద్యా సంస్థలు, పాలిటెక్నిక్?ల నుంచి 21 మంది, నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖకు చెందిన 13 మంది స్కిల్ ట్రైనర్లు ఉన్నారు.

## సెప్టెంబర్ 9వ తేదీ లోపు ఇరాన్‌పై దాడి

**న్యూఢిల్లీ :** ఇరాన్‌పై పునఃప్రారంభించిన సైనిక చర్య ఎక్కువ కాలం కొనసాగదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంటున్నారు. అయితే, అవసరమైతే అమెరికా మళ్లీ దాడి చేయవచ్చని ఆయన హెచ్చరిక కూడా జారీ చేశారు. ఈ రెండు అంశాలు ఒక అతిపెద్ద ప్రశ్నను లేవనెత్తుతున్నాయి:ఇరాన్ జాతకం, వార్షిక అంచనాలు, రాబోయే ఆరు రోజుల పంచాంగాన్ని పరిశీలిస్తే, ప్రమాదం ఇంకా తొలగిపోలేదు. సెప్టెంబర్ 6, 8 తేదీలు ముఖ్యంగా ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. అయితే, దీనిని దాడి కచ్చితంగా జరుగుతుందని చెప్పే అంచనాగా పరిగణించలేము. ఈ తేదీలలో జరిగే ఏ సైనిక చర్య అయినా, ప్రతీకార దాడి అయినా, నౌకకు సంబంధించిన సంఘటన అయినా, లేదా సాంకేతిక వైఫల్యం అయినా ఉద్రిక్తతలను పెంచవచ్చు.ఇరాన్‌పై అమెరికా చేపట్టిన కొత్త సైనిక చర్య ఎక్కువ కాలం కొనసాగదని సెప్టెంబర్ 2న ట్రంప్ అన్నారు. హోర్ముజ్ సమీపంలో అమెరికా సైన్యం ఇరాన్ రాడార్, క్షిపణి వ్యవస్థలు, సముద్ర మైన్లు అమర్చే పరికరాలను ధ్వంసం చేసిందని ఆయన పేర్కొన్నారు.అమెరికా ఎప్పుడైనా మరో దాడిని ప్రారంభించవచ్చని ట్రంప్ కూడా పేర్కొన్నారు. దీని అర్థం, సైనిక చర్యను నిలిపివేస్తున్నట్లు అధికారిక ప్రకటన ఏదీ వెలువడలేదు. మరో దాడి జరుగుతుందా లేదా అనేది ఇరాన్ ప్రతిస్పందన ,హోర్ముజ్‌లోని పరిస్థితిపై ఆధారపడి ఉంటుందిఅమెరికా జరిపిన తాజా దాడులతో ఇరాన్ జోర్డాన్, బహ్రెయిన్, కువైట్, ఇరాక్‌లలోని అమెరికా స్థావరాలు, ప్రయోజనాల వైపు క్షిపణులు, డ్రోన్‌లను ప్రయోగించింది. ఈ దాడులలో పలువురిని గగనతలంలోనే అడ్డుకున్నట్లు ఆ దేశం ప్రకటించింది. అమెరికా దాడుల్లో 18 మంది మరణించారని, 108 మంది గాయపడ్డారని ఇరాన్ పేర్కొంది. హోర్ముజ్ సమీపంలో జరిగిన వివాహ వేడుకపై కూడా దాడి జరిగిందని ఇరాన్ మీడియా నివేదించింది. పౌర మృతిపై వచ్చిన నివేదికలపై దర్యాప్తు చేస్తున్నట్లు అమెరికా తెలిపింది. ఈ సంఘటన పరిస్థితిని మరింత తీవ్రతరం చేసింది. ఇరాన్ తన ప్రతీకార చర్యలను తీవ్రతరం చేస్తే, అమెరికా దీనిని ఒక కొత్త దాడికి ఆధారంగా ఉపయోగించుకోవచ్చు. మరోవైపు, ఇరాన్ మౌనం దాని సొంత దేశంలోనే బలహీనతగా భావించబడవచ్చు.సెప్టెంబర్ 6వ తేదీ ఆకస్మిక సైనిక లేదా సాంకేతిక సంఘటనకు అత్యంత అవకాశం ఉన్న రోజు. సెప్టెంబర్ 8వ తేదీ ప్రత్యర్థి పక్షం ద్వారా మరో ప్రధాన చర్య లేదా ఎదురుదాడికి వేదిక కావచ్చు.సైనిక చర్య ఎక్కువ కాలం కొనసాగదని ట్రంప్ చెబుతున్నప్పటికీ, సెప్టెంబర్ 9వ తేదీకి ముందే యుద్ధం మరో మలుపు తిరగవచ్చు. ఆ తర్వాత కాల్పులు పూర్తిగా ఆగిపోయే అవకాశం లేదు. కానీ, చర్చల కోసం యుద్ధం తిరిగి ప్రారంభమయ్యే అవకాశం మాత్రం ఖచ్చితంగా పెరుగుతుంది

## ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లుపై జేపీసీ.

**న్యూఢిల్లీ :** విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లు, 2026 పై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా జాయింట్ పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేశారు. బిహార్ బీజేపీ ఎంపీ, లోక్‌సభలో బీజేపీ చీఫ్ విప్ డాక్టర్ సంజయ్ జైస్వాల్ ఈ కమిటీకి ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్నారు. లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలతో కూడిన జాయింట్ కమిటీ, ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లు, పలు అంశాలను పరిశీలించనుంది. ఈఅఖీం జాయింట్ పార్లమెంటరీ కమిటీలో పలు రాజకీయ పార్టీలకు చెందిన ఎంపీలు ఉన్నారు. బీజేపీ నుంచి డాక్టర్ సంజయ్ జైస్వాల్, భర్తృహరి మహతాబ్, తేజస్వి సూర్య, కమలేష్ జంగ్డే, ముఖేష్ కుమార్ చంద్రకాంత్ దలాల్, డాక్టర్ నిషికాంత్ దూబే, విష్ణు దయాళ్ రామ్, అనంత్ నాయక్, అరవింద్ ధర్మపురి సభ్యులుగా ఉన్నారు. కాంగ్రెస్ తరపున ఆంటో ఆంటోనీ, కెప్టెన్ విరియాటో ఫెర్నాండెజ్, మహ్మద్ హమ్దుల్లా సయీద్, కాళీ చరణ్ ముండా ఉన్నారు.ఈ ప్యానెల్‌లోని ఇతర లోక్‌సభ ఎంపీలలో సమాజ్‌వాదీ పార్టీకి చెందిన జియా–ఉర్–రెహమాన్, టీఎంసీకి చెందిన కళ్యాణ్ బెనర్జీ, డీఎంకేకు చెందిన ఎ. రాజా, టీడీపీకి చెందిన లావు శ్రీ కృష్ణ దేవరాయలు, శివసేనకు చెందిన నరేష్ గణపత్ మస్కే, జేడీ(యూ)కి చెందిన కౌశలేంద్ర కుమార్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ–శరద్చంద్ర పవార్, ఎన్‌సీపీ–ఎస్పీకి చెందిన సుప్రియా సూలే, ఐయూఎంఎల్‌కు చెందిన ఈటీ మహమ్మద్ బషీర్ ఉన్నారు.జాయింట్ కమిటీలో రాజ్యసభ ఎంపీలు సి.సదానందన్ మాస్టర్, హర్షవర్ధన్ ష్రింగ్లా, ఉజ్వల్ దేవ్‌రావ్ నికమ్, డాక్టర్ అల్కా గుర్జార్, సత్ పాల్ శర్మ, ప్రఫుల్ పటేల్, సంజయ్ కుమార్ ఝా, క్రిస్టోఫర్ మాణికం, డాక్టర్ మేనకా గురుస్వామి, పి.విల్సన్ ఉన్నారు.

# ఫ్యూచర్ సిటీలో మెగా ప్రాజెక్ట్

-మొదటిపేజీ తరువాయి

కుదిరింది. ఈ ప్రాజెక్టు ద్వారా తెలంగాణను దేశంలోని ప్రముఖ డేటా సెంటర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. తెలంగాణలో ఓపెన్ ఏఐకు అతిపెద్ద డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసే దిశగా ఈ ప్రాజెక్టు కీలకంగా ఉండనుందని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. వన్ గిగావాట్ సామర్థ్యం కలిగిన ఈ డేటా సెంటర్‌ను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మించనున్నట్లు తెలిపారు. డేటా సెంటర్లకు.. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ సేవలు వంటి రంగాల నుంచి భారీగా డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇంత పెద్ద డేటా సెంటర్ తెలంగాణలో ఏర్పాటు కావడం రాష్ట్ర డిజిటల్ ఎకానమీకి మరింత బలం చేకూరుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.



### దావోస్ భేటీతో మొదలై..

ఈ ప్రాజెక్టు వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రయత్నాలు కీలకమని ప్రభుత్వం చెబుతోంది. ఎందుకంటే.. జనవరిలో దావోస్‌లో టీసీఎస్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్‌తో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఆ సందర్భంగా తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఆయన కోరారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొస్తున్న 'తెలంగాణ రైజింగ్' పాలసీ, అలాగే ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికలపై టాటా సన్స్ చైర్మన్ ఆసక్తి చూపారని ప్రభుత్వం తెలిపింది. ముఖ్యమంత్రి చేసిన చర్చల అనంతరం టాటా గ్రూప్ ఈ భారీ ప్రాజెక్టుకు సిద్ధమైనట్లు వెల్లడించింది. ప్రస్తుతం టాటా గ్రూప్‌కు చెందిన సంస్థల్లో.. తెలంగాణలోనే సుమారు 83 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని ప్రభుత్వం పేర్కొంది. ఈ కొత్త ప్రాజెక్టుతో రాష్ట్రంలో టాటా గ్రూప్ కార్యకలాపాలు మరింత విస్తరించే అవకాశం ఉంది.

### ఏడువేల ఉద్యోగాలు

తెలంగాణలో ప్రారంభం కానున్న..ఈ భారీ డేటా సెంటర్ నిర్మాణాన్ని 18 నుంచి 24 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత సుమారు 7 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందని ప్రభుత్వం తెలిపింది. ముఖ్యంగా డేటా సెంటర్ నిర్మాణం, నిర్వహణ, సాంకేతిక సేవలు, విద్యుత్, భద్రత, మౌలిక వసతులు వంటి అనేక రంగాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది.

### ఫ్యూచర్ సిటీకి ప్రాధాన్యం

రూ.70 వేల కోట్ల పెట్టుబడి.. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో ఒక కీలక మైలురాయి అని ప్రభుత్వం చెబుతోంది. ప్రపంచ స్థాయి డేటా సెంటర్ ఏర్పాటు కావడం ద్వారా.. ఫ్యూచర్ సిటీ బ్రాండ్ అంతర్జాతీయ స్థాయికి చేరుకుంటుందని ప్రభుత్వం ఆశిస్తోంది. కాగా.. ఇప్పటికే ఫ్యూచర్ సిటీని భవిష్యత్ టెక్నాలజీ, పరిశ్రమలు, ఆధునిక మౌలిక వసతులకు కేంద్రంగా అభివృద్ధి చేయాలని తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఈ భారీ పెట్టుబడి మరిన్ని అంతర్జాతీయ, జాతీయ సంస్థలను తెలంగాణ వైపు ఆకర్షించే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

### మెండుగా బ్లూ కాలర్ ఉద్యోగాలు

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేక ఉద్యోగాలను భర్తీ చేసే అవకాశం ఉన్నప్పటికీ, బ్లూ కాలర్ ఉద్యోగాలను పూర్తిగా భర్తీ చేయడం సాధ్యం కాదని పేర్కొన్నారు. కానీ, టాటా గ్రూప్ చేపడుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా బ్లూ కాలర్ ఉద్యోగాలు పెరుగుతాయని అన్నారు. అందుకే.. తెలంగాణ ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. భవిష్యత్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు యువతలో పెంచడం ద్వారా వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యమని చెప్పారు.

### రేడియల్ రోడ్డు.. రతన్ టాటాకు అంకితం

ఫ్యూచర్ సిటీకి మౌలిక వసతులను మరింత బలోపేతం చేయడానికి.. త్వరలోనే కొంగరకలాన్ ఫ్యూచర్ సిటీకి రేడియల్ రోడ్డును నిర్మించనున్నట్లు సీఎం తెలిపారు. ఈ రహదారిని భారతరత్న రతన్ టాటాకు అంకితం చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. అంతే కాకుండా.. తెలంగాణను పెట్టుబడులకు అనుకూలమైన రాష్ట్రంగా మార్చి, భారీ పరిశ్రమలు, టెక్నాలజీ సంస్థలను ఆకర్షించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

### 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్లు

తెలంగాణను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడంలో.. భారీ పెట్టుబడులు కీలక పాత్ర పోషిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. 2037 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యాలను సాధించడానికి ప్రభుత్వం కష్టపడి పనిచేస్తోందని సీఎం తెలిపారు. టాటా, టీసీఎస్, హైపర్ వాల్ట్ వంటి సంస్థల భారీ పెట్టుబడులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

# ఇక సిరిసిల్ల, సిద్ధిపేటలపై దండయాత్రే

-మొదటిపేజీ తరువాయి

పాపాల భైరవుడు రావాలి అని వాళ్లు కోరుకుంటున్నారని, తమ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. మీ జిల్లాకు ఒకేసారి మూడు ఎమ్మెల్సీ పదవులను ఇచ్చామని, కేసీఆర్ సీఎం అయితే వాళ్ల కుటుంబసభ్యులకు పదవులు ఇచ్చారని, తమ ప్రభుత్వంలో ఉద్యమకారుల పిల్లలకు పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. అందరిలాగానే బీఆర్ఎస్ కార్యకర్తలకూ రేషన్‌కార్డులు, సన్నబియ్యం ఇస్తున్నామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తల ఇళ్లలో ఉచిత కరెంట్ వస్తోందంటే మా ప్రభుత్వం కృషి కాదా అని సీఎం ప్రశ్నించారు. మేం ఇచ్చిన రైతుభరోసా నిధులను ఎవరైనా బీఆర్ఎస్ కార్యకర్తలు వద్దన్నారా అని అడిగారు. సంపాదన పోయిందని బావ, బామ్మర్ది ఏడుస్తున్నారని ఎద్దేవా చేశారు.

"నాకు చదువు లేదని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. చదువు లేకపోయినా నాకు సంస్కారం ఉంది. నాకు సంస్కారం ఉంది కాబట్టే మీరు రోడ్లపై తిరుగుతున్నారు. నాకు సంస్కారం ఉంది కాబట్టే కొండా సురేఖ, సీతక్కతో రాఖీ కట్టించుకున్నా. ఎక్కడ ఆస్తి ఇవ్వాల్సి వస్తుందోనని మీరు చెల్లిని బయటకు గెంటేశారు. చెల్లిని బయటకు గెంటేసిన వ్యక్తి ఆడబిడ్డల గురించి ఆలోచిస్తారా?. నాలుగు ఇంగ్లీష్ ముక్కలు వస్తే సరిపోదు. ఆడబిడ్డను చూసుకోవాలి. నీ సంస్కారం ఏంటో నా సంస్కారం ఏంటో అసెంబ్లీకి రా చూసుకుందాం. నేను మంచిగా ఉంటే మీరు ఏదో అనుకుంటున్నారు. బందిపోట్లలా తెలంగాణను దోచుకున్నారు"



### రూ.36 వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేశాం

వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందన్న రేవంత్ రెడ్డి నకిరేకల్ గడ్డా కాంగ్రెస్ అడ్డా అని వేముల వీరేశం నిరూపించారని తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధికి అండగా ఉండాలని వీరేశం కోరారని అన్నారు. గత ప్రభుత్వం అమలుచేసిన ఏ పథకాన్ని అయినా రద్దు చేశామా అని అడిగారు. మీరు ఇచ్చిన పథకాలను మరింత మెరుగ్గా ఇస్తున్నామని, బీఆర్ఎస్ ప్రభుత్వం వల్ల రైతులు అనేక రకాలుగా మోసపోయారని, చివరి విడత రైతుభరోసా నిధులు వేయకుండానే గద్దె దిగిపోయారని పేర్కొన్నారు. మీరు ఎగవేసిన రైతుభరోసా రూ.36 వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేశామని, రాష్ట్రాన్ని అన్ని రకాలుగా ముంచి గద్దె దిగిపోయారని, వడ్ల కొనుగోలు, రైతుభరోసా, వడ్లకు బోనస్, ఉచిత కరెంట్ ఇస్తున్నామని వెల్లడించారు.

"మీకు ధైర్యం ఉంటే అసెంబ్లీకి రండి. అన్నీ చర్చిద్దాం. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం రూ.11 వేల కోట్లు ఇచ్చాం. ఇవాళ కోటి మంది మహిళలు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ఇవ్వడం చూసి కొందరు తట్టుకోలేకపోతున్నారు. మహిళలకు ఉచిత బస్సు రద్దు చేయాలంటూ ఆటో డ్రైవర్లను రెచ్చగొడుతున్నారు. సమస్యలు ఏంటో చెప్పాలని ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్నారు. వీలైన ప్రతిచోటా మహిళలను ప్రోత్సహిస్తున్నాం. కేసీఆర్ ఎప్పుడైనా మహిళల బాగు గురించి ఆలోచించారా?. మహిళలకు పెట్రోల్ బంకులు, సోలార్ నిర్వహణ అప్పగించాం. నిరుద్యోగ యువత ఉసురు పోసుకుని ఇవాళ ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారు. పిల్లి శాపాలకు ఉట్లు తెగవని కేసీఆర్ గుర్తుపెట్టుకోవాలి" – రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి

### అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం

నల్గొండ జిల్లా నకిరేకల్‌లో రూ.32 కోట్లతో నిర్మించిన 100 పడకల ఆస్పత్రిని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి ఆస్పత్రి మొత్తం తిరిగి పరిశీలించారు. ఆస్పత్రిలో అందించబోయే సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. నకిరేకల్‌లో పలు అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. రూ.345 కోట్లతో 12 రకాల అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, సమీకృత మండల కార్యాలయాల సముదాయ నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేశారు.

# అవకాశం ఉన్నా అందుకోలేకపోతున్న తెలంగాణ బీజేపీ

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయ రంగంలో భారతీయ జనతా పార్టీ ఒక ప్రత్యేకమైన సవాలును, అదే సమయంలో అపారమైన అవకాశాన్ని ఎదుర్కొంటోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బలమైన ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు కావాల్సిన సానుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ, ఆ అవకాశాలను ప్రత్యక్ష రాజకీయ ప్రయోజనాలుగా మలచుకోవడంలో బీజేపీ పూర్తి స్థాయిలో సఫలీకృతం కాలేకపోతోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీ స్థానాలను గెలుచుకుని, 35 శాతం మేర ఓటు షేర్‌ను సాధించి తన ప్రాభవాన్ని చాటుకున్నప్పటికీ, ఆ ఊపును క్షేత్రస్థాయి స్థానిక సంస్థల ఎన్నికలు మరియు నియోజకవర్గ స్థాయిలో నిలబెట్టుకోవడంలో పార్టీ కొంత తడబడుతోంది.ప్రస్తుతం తెలంగాణ బీజేపీలో వ్యక్తమవుతున్న అతిపెద్ద లోపం బలమైన నిలకడైన నాయకత్వం . ఉత్తర తెలంగాణలో పార్టీకి గట్టి పట్టు ఉన్నప్పటికీ, తెలంగాణ వ్యాప్తంగా ఓటర్లను ఆకర్షించగల, సర్వామోదయోగ్యమైన అగ్రనేత కొరత స్పష్టంగా కనిపిస్తోంది. తరచూ మారుతున్న వ్యూహాలు, నాయకత్వ మార్పులు, అంతర్గత విభేధాలు క్యాడర్‌లో గందరగోళాన్ని నింపుతున్నాయి. ప్రజల సమస్యలపై నిలకడగా పోరాటం చేస్తూ, ప్రతీ నియోజకవర్గంలో పార్టీని నడిపించే ఒక పవర్‌ఫుల్ ఫేస్ లేకపోవడం పార్టీ విస్తరణకు ప్రధాన ప్రతిబంధకంగా మారింది.పాక్షికంగా బిఆర్ఎస్ వైఖరి పట్ల సానుభూతి, మెత్తటి వైఖరి అవలంబిస్తుందనే ప్రచారం కూడా బీజేపీకి రాజకీయంగా నష్టం చేకూరుస్తోంది. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనపై కోపంతో ఉన్న ఓటర్లు లేదా కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి చెందుతున్న ప్రజలు ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు చూడాలంటే.. బీజేపీ స్పష్టమైన ప్రతిపక్ష పాత్రను పోషించాల్సి ఉంటుంది. బిఆర్ఎస్ గ్రాఫ్ పడిపోతున్న ప్రతిసారీ ఆ పార్టీ స్థానాన్ని ఆక్రమించడంలో వెనకబడితే, ఆ ఓటు బ్యాంక్ మొత్తం తిరిగి కాంగ్రెస్ వైపునకో లేదా స్వతంత్రుల వైపునకో మరలే ప్రమాదం ఉంది.భవిష్యత్తులో బీజేపీ అధికార పీఠానికి చేరువ కావాలంటే, బిఆర్ఎస్ సాంప్రదాయక ఓటు బ్యాంకును కైవసం చేసుకోవడమే ఏకైక మార్గం. ఒకప్పుడు బిఆర్ఎస్‌కు అండగా నిలిచిన గ్రామీణ, వెనుకబడిన వర్గాలు, తటస్థ ఓటర్లను తనవైపు తిప్పుకునేందుకు పక్కా ప్రణాళిక అవసరం. బిఆర్ఎస్ నాయకత్వం రెస్ట్ మోడ్‌లో ఉందనే భావన ప్రజల్లో ఉన్నప్పుడు, ఆ ఖాళీని బీజేపీ తన నిరంతర ప్రజా ఉద్యమాల ద్వారా భర్తీ చేయాలి. కేవలం హిందూత్వ ఎజెండా లేదా పార్లమెంట్ ఎన్నికల నాటి ఇమేజ్‌పైనే ఆధారపడకుండా, స్థానిక సమస్యలపై పోరాటం చేయాల్సి ఉంటుంది. అయితే ఈ మార్గం అనుకున్నంత సులువు కాదు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కాంగ్రెస్ తన సంక్షేమ పథకాలు, క్షేత్రస్థాయి యంత్రాంగంతో బలంగా నిలబడింది. బిఆర్ఎస్ ఓటు బ్యాంకును ఆకర్షించడంలో కాంగ్రెస్ సైతం తన మార్క్ చూపుతోంది. ఈ త్రికోణ పోటీలో బీజేపీ తన ప్రత్యర్థి కేవలం కాంగ్రెస్ మాత్రమేనని చాటిచెబుతూ, బిఆర్ఎస్ మిగిల్చిన రాజకీయ శూన్యాన్ని భర్తీ చేయడానికి సమగ్రమైన సంస్థాగత నిర్మాణం చేపడితే తప్ప అనుకున్న లక్ష్యం సాధ్యం కాదు.రాబోయే రెండేళ్ల సమయం తెలంగాణ బీజేపీకి అత్యంత కీలకమైనది. పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధి దాటి, గల్లీ స్థాయి వరకు కమిటీలను బలోపేతం చేసుకోవడం, ఇతర పార్టీల నుంచి సీనియర్ నేతలను ఆకర్షించడం మరియు ఓటర్లలో నమ్మకాన్ని కలిగించేలా ఏకీకృత నాయకత్వాన్ని తీసుకురావడం తక్షణ అవసరం. వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ, సానుభూతి రాజకీయాలను పక్కనబెట్టి అగ్రెసివ్ అప్రోచ్‌తో ముందుకు వెళ్తేనే తెలంగాణలో కమలం వికసించే అవకాశాలు మెరుగవుతాయి.



## రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

-మొదటిపేజీ తరువాయి

సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. ఈసారి అసెంబ్లీ సమావేశాలు హాట్ హాట్‌గా జరిగే అవకాశం ఉందని గుత్తా అన్నారు. సభకు సంబంధించిన అన్ని శాఖల అధికారులు సమావేశాల సమయంలో అందుబాటులో ఉండాలని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి? ఆదేశించారు. సభ్యులకు అందించే మెటీరియల్‌ను తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో ముందుగానే అందించాలని సూచించారు. సభ లోపల, బయట ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పీకర్, ఛైర్మన్? ఆదేశాలు జారీ చేశారు. ధర్నాలు, రాస్తారోకోలు జరగకుండా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటెలిజెన్స్ సమాచారం వేగంగా అసెంబ్లీ అధికారులకు చేరేలా సమన్వయం చేయాలని ఆదేశించారు. సమావేశాల నిర్వహణ కోసం నోడల్ అధికారులను నియమించాలన్నారు.

### ప్రభుత్వ తరఫున పూర్తి సహకారం అందిస్తాం

సభ్యుల ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలను ఒకరోజు ముందే అందించాలని అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. ప్రతి శాఖ నుంచి ఒక అధికారి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఉభయ సభల సమావేశాలు ప్రభుత్వ కార్యనిర్వాహక వ్యవస్థ సమర్థతకు నిదర్శనమని శ్రీధర్ బాబు అన్నారు. ప్రభుత్వం తరఫున సమావేశాలకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు.

### వర్షాకాల సమావేశాలు వాడివేడిగా సాగే సూచనలు

ఈ వర్షాకాల సమావేశాల్లో పలు కీలక బిల్లులు ప్రవేశపెట్టడంతో పాటు, ప్రజలు ఎదుర్కొంటున్న పలు ముఖ్యమైన సమస్యలపై సుదీర్ఘంగా చర్చించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు, ప్రజా సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు విపక్షాలు కూడా సిద్ధమవుతున్నాయి. దీంతో ఈసారి వర్షాకాల సమావేశాలు వాడీవేడిగా సాగే సూచనలు కనిపిస్తున్నాయి. వర్షాకాల సమావేశాలు ఎన్ని రోజుల పాటు కొనసాగుతాయనేది బిజినెస్ అడ్వైజరీ కమిటీ-బీఏసీ సమావేశంలో నిర్ణయించనున్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, కొత్త బిల్లుల ఆమోదం లాంటివి ప్రభుత్వ అజెండాగా ఉంటాయి.

## కేబినెట్ విస్తరణ ఇప్పట్లో లేనట్లే



-మొదటిపేజీ తరువాయి

ఎలాంటి సమాచారం లేదు. మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు చేయాలనేది సీఎం రేవంత్ రెడ్డి ఇష్టం. నాకు మంత్రి పదవి అనే ప్రచారంపై నాకు మాత్రం సమాచారం లేదు. అవన్నీ ఊహాగానాలే. అలాగే, కొండా సురేఖను కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించాం. సురేఖ విషయంలో అందరం మా వంతు ప్రయత్నం చేశాం. సురేఖ విషయంలో ఏఐసీసీ ఒప్పుకోలేదు అంటూ వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ ఆశయాన్ని రేవంత్ నెరవేర్చారు. కుల సర్వే శాస్త్రీయంగా చేశాం. రాబోయే వంద రోజులు దేశవ్యాప్తంగా బీసీ హక్కుల గర్జన చేస్తాం. బీసీ హక్కుల కోసం జరిగే గర్జనను విజయవంతం చేయండి' అని పిలుపునిచ్చారు. మరోవైపు.. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బండి సంజయ్, అరవింద్, ఈటల, లక్ష్మణ్ బీసీల అంశంపై స్పందించాలి. అడిగితే పదవులు పోతాయని బీజేపీ బీసీ నేతలు భయపడుతున్నారా?. తెలంగాణలో బీజేపీ ఉండాలా వద్దా తేల్చుకోండి. కుల గణనలో దేశానికి రోల్ మోడల్‌గా ఉన్నాం. తెలంగాణ చేసిన కులగణనలో అన్ని విషయాలు పొందుపరిచాం. మేం పంపిన ఫైల్‌పై కేంద్రం ఇప్పటికీ నిర్ణయం తీసుకోలేదు. ఓబీసీల జనాభాను ఎందుకు లెక్కించడం లేదు? అని ప్రశ్నించారు.

## మామ గారి ఆస్తులు అమ్మకం..

**హైదరాబాద్ :** మేఘా.. రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. మనదేశంలోని ప్రధాన రాష్ట్రాల్లోనే కాదు.. ఏకంగా 20 దేశాలలో కార్యకలాపాలు సాగిస్తోంది. కొన్ని దశాబ్దల క్రితం ఒక సాధారణ పైపుల కంపెనీగా ప్రారంభమైంది మేఘా కంపెనీ. పిచ్చిరెడ్డి.. ఆయన మేనల్లుడు కృష్ణారెడ్డి ఈ కంపెనీని నిర్వహిస్తున్నారు.ముఖ్యంగాఇన్ఫ్రా రంగంలో ఈ కంపెనీ తిరుగులేని స్థాయిలో ఉంది. 2024 ఎన్నికలకు ముందు దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీల ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసిన కంపెనీల జాబితాలో ఈ సంస్థ రెండవ స్థానంలో ఉంది. కాళేశ్వరం.. పోలవరం హెడ్ వర్క్స్.. జోజిలా అండర్ టన్నెల్.. ఇంకా అనేక రకాల పనులను ఈ కంపెనీ చేపడుతోంది. కృష్ణారెడ్డికి ఇద్దరు కుమారులు. భార్య సుధా రెడ్డి కూడా వ్యాపారంలో ఉన్నారు. ఇటలీలో ఆయిల్ రిగ్గింగ్.. డిఫెన్స్ రంగంలో పరికరాల తయారీ.. ఇంకా అనేక విభాగాలలో కృష్ణారెడ్డి కుమారులు వ్యాపారాలు చేస్తున్నారు. సుధా రెడ్డి కూడా ఫ్యాషన్ ఐకాన్ గా ఉన్నారు. పిచ్చిరెడ్డికి వారసులు లేరు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. పైగా ఈ కంపెనీలో ఉన్న 43 శాతం వాటాను అమ్మాలని.. ఆ బాటను అమ్మితే వచ్చే డబ్బును ఇద్దరి కుమార్తెలకు సమానంగా పంచాలని.. 65 సంవత్సరాలకు మించిన వయసులో ఉన్న తాను హాయిగా రెస్టు తీసుకోవాలని పిచ్చి రెడ్డి అనుకుంటున్నట్టు తెలుస్తోంది.ఈ కంపెనీలో కృష్ణారెడ్డికి ప్రస్తుతం 51 శాతం వాటా ఉంది. మిగతా వాటాను కూడా కొనుగోలు చేస్తే కృష్ణారెడ్డి ఈ కంపెనీకి పూర్తిస్థాయిలో యజమానిగా మారిపోతారు. పిచ్చిరెడ్డి సంబంధించిన వాటాను కొనుగోలు చేయడానికి కృష్ణారెడ్డి అంతర్జాతీయ ప్రైవేట్ క్రెడిట్ ఇన్వెస్టర్ల నుంచి నిధులు సమకూర్చుకుంటున్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయం ప్రకారం ఈ డీల్ విలువ దాదాపు 15వేల కోట్ల వరకు ఉంటుందని సమాచారం. ఈ వాటా కొనుగోలు కోసం దాదాపు 6650 కోట్లను ప్రైవేటు ఇన్వెస్టర్ల నుంచి కృష్ణారెడ్డి సమీకరిస్తున్నట్టు సమాచారం.కంపెనీని కొనుగోలు చేసిన తర్వాత నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజిలో లిస్ట్ చేయాలని కృష్ణారెడ్డి అనుకుంటున్నట్టు తెలుస్తోంది. తద్వారా కంపెనీ విలువ పెరుగుతుందని.. గ్లోబల్ వ్యాప్తంగా మరిన్ని ప్రాజెక్టులు చేయడానికి ఆస్కారం ఏర్పడుతుందని కృష్ణారెడ్డి భావిస్తున్నారు.ఇన్ఫ్రా విభాగంలో తలనొప్పులు విపరీతంగా ఉంటాయి. ప్రాజెక్టులు తీసుకురావడం.. ప్రభుత్వాలతో మాట్లాడటం.. ఏజెన్సీలను ఒప్పించడం.. ఇంకా తెర వెనుక వ్యవహారాలను సాగించడం అంత ఈజీ కాదు. అయితే 65 ఏళ్ల వయసులో తాను ఈ స్థాయిలో ఇబ్బంది పడబోనని పిచ్చిరెడ్డి నిర్ణయించుకున్నారు. అందువల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. పైగా ఇద్దరు కుమార్తెలకు సమానంగా ఆస్తులను పంచి.. విశ్రాంత జీవితాన్ని సుఖంగా గడపాలని పిచ్చిరెడ్డి అనుకుంటున్నారు.పిచ్చిరెడ్డి స్వస్థలం కృష్ణా జిల్లా దోకిపర్రు. ఆ గ్రామంలో అనేక రకాలుగా ఆయన సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్నో ఆలయాలు కట్టించారు. విశ్రాంత జీవితం మొత్తం దోకిపర్రు లోనే గడపాలని ఆయన నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. అందువల్లే వాటాలు అమ్మి.. ఇద్దరు కుమార్తెలకు సమానంగా ఆస్తులు పంచి.. తన చేతిలో కొంతమేర నగదు ఉంచుకోవాలని పిచ్చిరెడ్డి భావిస్తున్నట్టు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. మొత్తానికి ఇన్ని రోజులపాటు పిచ్చిరెడ్డి.. కృష్ణారెడ్డి చేతుల్లో ఉన్న మేఘా కంపెనీ పూర్తిగా కృష్ణారెడ్డి చేతుల్లోకి వెళ్లిపోతుండడం నిజంగా వ్యాపార వర్గాలలో సరికొత్త చర్చకు దారితీస్తోంది. మరోవైపు నిధుల సమీకరణ క్రమంలో తన చేతిలో ఉన్న కీలక ప్రాజెక్టులను కేకేఆర్ అనే కంపెనీకి మేఘా విక్రయించబోతున్నట్టు తెలుస్తోంది.

## సంపాదకీయం

# జీడీపీ పెరుగుతోంది... కానీ...

2026 ఏప్రిల్ నుంచి జూన్ మధ్య భారతదేశ వాస్తవ జీడీపీ 7.8 శాతం వృద్ధి చెందింది. గత సంవత్సరం ఇదే త్రైమాసికంలో వృద్ధి రేటు 6.9 శాతంగా ఉంది. ఆర్‌బిఐ 7 శాతం వృద్ధి రేటును అంచనా వేసింది. దీని అర్థం భారతదేశ పనితీరు అంచనాలను మించిపోయింది.అయితే ఈ పెరుగుదలకు సామాన్య ప్రజలు చేసే కొనుగోళ్లు అతిపెద్ద కారణం కాదు రోడ్లు, కర్మాగారాలు, యంత్రపరికరాలు , ఇతర ప్రధాన ప్రాజెక్టులలో పెట్టుబడి 11.9 శాతం పెరిగింది. సేవా రంగం 10 శాతం వృద్ధి చెందింది. బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్, ఐటీ , వృత్తిపరమైన సేవలు 12.1 శాతం వృద్ధి చెందాయి. పోల్చి చూస్తే, సామాన్య ప్రజల వ్యయం 7.1 శాతం పెరగగా, వ్యవసాయ రంగం కేవలం 3.6 శాతం మాత్రమే పెరిగింది. దీని అర్థం ఏంటంటే, పెద్ద కంపెనీలు, తయారీ , సేవా రంగాలు దేశ వృద్ధిని నడిపించాయి. గ్రామీణ ప్రాంతాలు, చిన్న వ్యాపారాలు , సాధారణ కుటుంబాలు వెనుకబడి ఉన్నాయి. అందుకే సానుకూల జీడీపీ గణాంకాలు గృహ బడ్జెట్‌లలో ఇంకా స్పష్టంగా ప్రతిబింబించడం లేదు. దేశాలు, పెద్ద కంపెనీలు ఎక్కువ సంపాదించవచ్చు, కానీ అదే వేగంతో కొత్త ఉద్యోగాలు ఉండవు. యంత్రాలు, కొత్త సాంకేతికత తక్కువ మంది కార్మికులతో ఎక్కువ సాధించడానికి సహాయపడతాయి. దీనివల్ల ఉత్పత్తి, జీడీపీ పెరుగుతాయి, కానీ ఉద్యోగార్థులు తక్షణ ప్రయోజనాలను చూడలేరు.గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక జీడీపీని 2011-12ను ప్రాతిపదికగా తీసుకున్న పాత విధానంలో కొందరు రూ.86 లక్షల కోట్లుగా లెక్కించారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక జీడీపీని 2022-23 బేస్ ఇయర్‌గా తీసుకున్న కొత్త విధానంలో రూ.88 లక్షల కోట్లుగా లెక్కించారు.ఈ రెండు గణాంకాలను నేరుగా పోల్చడం వల్లే కొందరు విమర్శకులు వృద్ధి రేటు కేవలం 2-2.3 శాతమేనని చెబుతున్నారని నాగేశ్వరన్ పేర్కొన్నారు.అయితే, రెండు వేర్వేరు విధానాల్లో లెక్కించిన గణాంకాలను నేరుగా పోల్చడం సరికాదని స్పష్టం చేశారు.గత ఏడాది తొలి త్రైమాసిక జీడీపీ గణాంకాలను కూడా కొత్త విధానంలో తిరిగి లెక్కించి, ఆ తర్వాత ప్రస్తుత ఏడాది గణాంకాలతో పోల్చాలని సీఈఏ వివరించారు.పాత సిరీస్ కొనసాగి ఉంటే, కొత్త మెథడాలజీ ప్రకారం ఈజ26 ఖ1 జీడీపీ రూ.86 లక్షల కోట్ల కంటే ఎక్కువగా, దాదాపు రూ.90 లక్షల కోట్లకు చేరి ఉండేదని ఆయన అంచనా వేశారు.అలా సవరించిన గత ఏడాది గణాంకంతో ప్రస్తుత ఏడాది రూ.88 లక్షల కోట్ల జీడీపీని పోల్చినప్పుడే వాస్తవికమైన, న్యాయమైన వృద్ధి రేటు తెలుస్తుందని చెప్పారు.అంతేకానీ, భిన్నమైన కొలమానాలతో వచ్చిన రెండు అంకెలను నేరుగా పోల్చి వృద్ధిని అంచనా వేయడం సరైన పద్ధతి కాదన్నారు.గత ఏడాది జీడీపీ గణాంకాల్లో వచ్చిన మార్పులకు కేవలం డబుల్ డిఫ్లేటర్ విధానమే కారణం కాదని నాగేశ్వరన్ తెలిపారు.మెరుగైన కార్యనిర్వహణ, అసంఘటిత రంగానికి మరింత విస్తృతమైన కవరేజీ వంటి పలు అంశాలు కూడా ఇందుకు కారణమని వివరించారు.కొత్త విధానంలో ఈజ26 గణాంకాలు పెరగకపోవడం కూడా గతంలోనే ఆర్థిక వ్యవస్థను సరైన స్థాయిలో కవర్ చేశామనడానికి ఒక సూచనగా ఆయన పేర్కొన్నారు.జీడీపీని లెక్కించేటప్పుడు నామినల్ జీడీపీ, అంటే ధరల మార్పుల ప్రభావంతో కూడిన గణాంకం నుంచి రియల్ జీడీపీని గుర్తించాలి.రియల్ జీడీపీ అంటే ధరల ప్రభావాన్ని తొలగించిన తర్వాత ఉత్పత్తి వాస్తవంగా ఎంత పెరిగిందో చూపించే గణాంకం.ఇందుకోసం ద్రవ్యోల్బణ ప్రభావాన్ని తొలగించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో ఉపయోగించే సాధనాన్నే 'డిఫ్లేటర్' అంటారు.అంతర్జాతీయ సంస్థల సూచనలతోనే డబుల్ డిఫ్లేటర్ విధానం తీసుకోలేదుడబుల్ డిఫ్లేటర్ పద్ధతిని కేవలం అంతర్జాతీయ సంస్థల సూచనల మేరకే భారత్ అనుసరిస్తోందన్న వాదనను నాగేశ్వరన్ తోసిపుచ్చారు.గణాంక నిపుణులతో విస్తృతంగా చర్చించిన తర్వాతే ఈ విధానాన్ని ఎంచుకున్నామని తెలిపారు.ఇన్‌పుట్, అవుట్‌పుట్ ధరలు వేర్వేరు కారణాల వల్ల మారుతుంటాయని, అందువల్ల వాటి ధరల ప్రభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేయడానికి డబుల్ డిఫ్లేటర్ పద్ధతి సరైనదని వివరించారు.దేశ ఆర్థిక వ్యవస్థ నమోదు చేసిన 7.8 శాతం వృద్ధి రేటు అకస్మాత్తుగా వచ్చినది కాదని నాగేశ్వరన్ స్పష్టం చేశారు.దీనికి ముందే పలు నెలవారీ ఆర్థిక సూచికలు బలమైన వృద్ధి సంకేతాలను ఇచ్చాయని తెలిపారు.జీఎస్టీ వసూళ్లు, ఈ-వే బిల్లుల జారీ, వాహన విక్రయాలు, ఎగుమతుల వృద్ధి, బ్యాంకు రుణాల పెరుగుదల వంటి సూచికలు ఆర్థిక కార్యకలాపాల్లో వేగాన్ని ముందుగానే సూచించాయని పేర్కొన్నారు.ఈ వివరాలు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమ్స్, ప్రభుత్వ ఖజానా వంటి విశ్వసనీయ వనరుల నుంచి సేకరించినవేనని చెప్పారు. ఉద్యోగాలపై ప్రభావం చూపే అంశాలు ఒక్కటే కావని, సాంకేతిక పరిజ్ఞానంలో మార్పులు, సామాజిక-ఆర్థిక పరిస్థితులు, స్వచ్ఛందంగా ఉద్యోగం చేయకూడదనే నిర్ణయం వంటి అనేక అంశాలు దీనిపై ప్రభావం చూపుతాయని వివరించారు.ఇతర దేశాలతో పోలిస్తే భారతదేశంలో ఉద్యోగాల వృద్ధికి సంబంధించిన ధోరణులు మెరుగ్గా ఉన్నాయని నాగేశ్వరన్ అభిప్రాయపడ్డారు.

# సగటు పౌరుడి ఆదాయానికి గండి

పన్నెండేండ్లుగా నరేంద్ర మోదీ నేతృత్వంలోని పాలనను ఆయన మద్దతుదారులు ఒక అపూర్వ నవశక పరివర్తనగా చిత్రీకరిస్తూ వస్తున్నారు. వారి దృష్టిలో మోదీ ఒక తిరుగులేని సంస్కరణాభిలాషి. పాతకాలపు పాలనా స్తబ్ధతను బద్దలు కొట్టి, రహదారులు, విమానాశ్రయాల వంటి మౌలిక వసతుల కల్పనను పరుగులు పెట్టించి, ప్రజాసేవలను డిజిటల్ బాట పట్టించి, అంతర్జాతీయ యవనికపై దేశ ప్రతిష్టను సమున్నతంగా నిలిపిన నేతగా వారు భావిస్తారు. గత రాజకీయాల అనిశ్చితిని తుడిచిపెట్టి, బలమైన, కేంద్రీకృత పాలనా శైలిని ఆయన తీసుకొచ్చారని విశ్వసిస్తారు. మోదీ రాజకీయ ప్రభంజనం ప్రధానంగా రెండు ఆకర్షణీయమైన వాగ్దానాలపై నిలబడింది. ఒకటి 'గుజరాత్ మాడల్' చాటిన ఆర్థిక సమర్థత కాగా, రెండోది 'కనిష్ఠ ప్రభుత్వం గరిష్ఠ పాలన' అనే నినాదం.

విమర్శకుల దృష్టిలో మాత్రం ఇదే దశాబ్దంలో మరో ఆందోళనకర పరిణామం కనిపించింది. కార్యనిర్వాహక అధికారాల మితిమీరిన కేంద్రీకరణ, రాజ్యాంగ వ్యవస్థల స్వయం ప్రతిపత్తిపై దెబ్బ, భిన్నాభిప్రాయాలను వ్యక్తీకరించే ప్రజాస్వామ్య స్వేచ్ఛ సంకోచం, పౌర సమాజంపై ఒత్తిడి, రాజ్యాంగ రక్షణల క్రమక్షీణత వారిని కలవరపెట్టాయి. ఎన్నేండ్లుగానో ఈ రెండు పక్షాలూ తమకు అనుకూలమైన ఉపన్యాసాలు, ఎంపిక చేసుకున్న గణాంకాలతోనే వాదోపవాదాలు సాగిస్తున్నాయి. సమర్థకులు నూతన రహదారులు, విమానాశ్రయాలు, డిజిటల్ చెల్లింపులు, సంక్షేమ పథకాల విస్తృతిని ప్రదర్శిస్తుంటే, ప్రజాస్వామ్య తిరోగమనం, సంస్థాగత విధ్వంసం, రాజకీయ ధ్రువీకరణ, పెరుగుతున్న ఆర్థిక అసమానతలను మోదీ వ్యతిరేకులు ఎత్తిచూపుతున్నారు.

దేశంలో వాదోపవాదాల హోరులో అసలైన మౌలిక ప్రశ్న మరుగున పడిపోతున్నది. 2013తో పోలిస్తే 2024 నాటికి కొత్త రోడ్లు వచ్చాయా? సాంకేతికత విస్తరించిందా? అనేది మాత్రమే పరిపాలనా దక్షతకు అసలైన కొలబద్ద కాదు. కాలక్రమంలో సహజంగా వచ్చే సాంకేతిక పురోగతి, జనాభా పెరుగుదల, పట్టణీకరణ, ప్రైవేట్ రంగ విస్తరణల వల్ల భారత్ వంటి పెద్ద దేశం ఎలాగైనా ఎంతోకొంత ముందుకు సాగుతూనే ఉంటుంది. ఇక్కడ తేలాల్సిన అసలైన, అత్యంత నిష్ఠూరమైన ప్రశ్న ఒక్కటే. మోదీ పాలన వల్ల భారతదేశం, పూర్వపు సహజ గమనంలో సాధించాల్సిన ప్రగతి కంటే మెరుగైన ఫలితాలను నిజంగా సాధించగలిగిందా?

ఆర్థికవేత్తలు కెవిన్ గ్రియర్, రాబిన్ గ్రియర్ సంయుక్తంగా వెలువరించిన పరిశోధనా పత్రం 'ప్రామిజెస్: గవర్నెన్స్ అండ్ గ్రోత్ ఇన్ ఇండియా అండర్ మోదీ అండ్ ది బీజేపీ' ఈ ప్రశ్ననే లోతుగా శోధించింది. రాజకీయ నినాదాలను పక్కనపెట్టి, ఒక కచ్చితమైన శాస్త్రీయ నమూనా ద్వారా మోదీ పాలనా తీరును మదింపు చేసింది.

2014కు ముందున్న రాజకీయ, ఆర్థిక గమనం యథావిధిగా కొనసాగి ఉంటే దేశం నేడు ఏ స్థాయిలో ఉండేదో గణాంకాలతో అంచనా వేసి, దాన్ని మోదీ హయాంలోని వాస్తవ ఫలితాలతో తులనాత్మకంగా పోల్చి చూసింది.

కెవిన్ గ్రియర్, రాబిన్ గ్రియర్ విశ్లేషణ ప్రకారం మోదీ పన్నెండేండ్ల పాలన ఒక వాగ్దాన భంగాల కథ. అటు ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడంలో, ఇటు ఆర్థిక పురోగతి సాధించడంలో దేశం తన సహజ సామర్థ్యం కంటే వెనుకబడింది. పరిశోధకుల పరిభాషలో చెప్పాలంటే 'భారత్ అత్యంత ప్రమాదకరమైన అధ్వాన స్థితి'కి చేరింది. అంటే ఒకవైపు సంస్థాగత వ్యవస్థలు బలహీనపడటం, మరోవైపు ఆర్థిక ప్రగతి కూడా ఆశించిన స్థాయి కంటే మందగించడం ఏకకాలంలో సంభవించాయి.

### అసలైన గీటురాయి

2014లో మోదీ అధికారంలోకి వచ్చినప్పుడు, దేశంలో నడుస్తున్న సాధారణ అభివృద్ధి చక్రాలను అలాగే నడిపిస్తానని మాత్రమే చెప్పలేదు. సమూల పరివర్తన తీసుకొస్తానని హామీ ఇచ్చారు. తన దృఢమైన నాయకత్వం, సత్వర నిర్ణయాలు, అధికార యంత్రాంగపు జాప్యాన్ని తగ్గించడం, పారిశ్రామిక అనుకూల వాతావరణం దేశ రూపురేఖలనే సమూలంగా మార్చేస్తాయని ప్రచారం చేశారు. గత పాలకులు అరవై ఏండ్లలో చేయలేనిది తాము అరవై నెలల్లో సాధిస్తామని ప్రకటించారు.

పరిపాలనా పరమైన హామీ కూడా అంతే ప్రతిష్ఠాత్మకమైనది. 'కనిష్ఠ ప్రభుత్వం గరిష్ఠ పాలన' ద్వారా పాలనలో సమర్థత, పారదర్శకత, జవాబుదారీతనం ఇనుమడిస్తాయని ప్రజలు ఆశించారు. బలమైన రాజకీయ నాయకత్వం వస్తే వ్యవస్థలు పటిష్టమవుతాయని, దాంతో పాటే ఆర్థికాభివృద్ధి కూడా శరవేగంగా పరుగులు తీస్తుందన్న ఆశల మధ్యనే మోదీ అధికారాన్ని చేపట్టారు. ఈ వాగ్దానాలనే గీటురాయిగా తీసుకొని కెవిన్ గ్రియర్, రాబిన్ గ్రియర్ పరిశోధన చేశారు. 2014 తర్వాత భారత్ ఎదిగిందా లేదా అనేది వారి ప్రశ్న కాదు, దేశం కచ్చితంగా ఎదిగింది. కానీ, అంతకుముందున్న సహజమైన వేగం కొనసాగి ఉంటే సాధించాల్సిన దానికంటే వేగంగా, సమర్థంగా ఎదిగిందా లేదా అనేదే వారు పరిశీలించారు. దీనికోసం వారు గణాంక శాస్త్రంలో పేరొందిన 'సింథటిక్ కంట్రోల్ మెథడ్'ను ఉపయోగించారు. భారత్‌ను ఏదో ఒక దేశంతో మాత్రమే పోల్చకుండా, 2014కు ముందు భారతదేశ ఆర్థిక, పాలనా పరిస్థితులతో దగ్గరి పోలికలున్న పలు దేశాల సూచికలను కలిపి భారత్‌ను ఒక నమూనాగా సృష్టించారు. ఈ ఆర్థిక నమూనాలో ఇథియోపియా, చైనా, బంగ్లాదేశ్‌కు ప్రధాన వాటాలు ఉండగా, పాకిస్థాన్, ఫిలిప్పీన్స్ వంటి ఇతర దేశాల గణాంకాలూ ఉన్నాయి.

ఈ దేశాలు రాజకీయంగా భారత్‌తో సమానమని చెప్పడం వీరి ఉద్దేశం కాదు, 2014 కంటే ముందు భారత్ ఏ గమనంలో సాగిందో అదే రీతిని పునఃసృష్టించగల ఒక ప్రామాణిక నమూనాను తయారు చేయడమే వీరి లక్ష్యం. 2014 వరకు ఈ నమూనా భారతదేశ వాస్తవ గమనంతో అచ్చంగా సరిపోయింది. అయితే 2014 తర్వాత మాత్రం వాస్తవ భారతదేశం, ఈ నమూనా అంచనా వేసిన స్థాయి కంటే దిగజారడం మొదలైంది. ఆ వ్యత్యాసమే మోదీ పాలనలోని డొల్లతనాన్ని బహిర్గతం చేసింది.

### దేశం చేరిన అధ్వాన తీరం

మోదీ దశాబ్దపు పాలనను విశ్లేషించేందుకు పరిశోధకులు నాలుగు పరిణామాలతో కూడిన ఒక సూత్రాన్ని ప్రతిపాదించారు. మొదటిది, మెరుగైన పాలనతోపాటు అద్భుతమైన ఆర్థిక పురోగతిని ఏకకాలంలో సాధిస్తామన్న మోదీ వాగ్దానం. రెండోది, ప్రజాస్వామ్య స్వేచ్ఛ కాస్త తగ్గినా, కండ్లు చెదిరే స్థాయిలో ఆర్థిక ప్రగతి సాధించడంతో సరిపెట్టుకోవడం. మూడోది, వ్యవస్థాగత నియమాలు బాగుపడినా ఆర్థికవృద్ధి నెమ్మదించే ప్రజాస్వామ్య వైరుధ్యం. ఇక నాలుగోది ప్రజాస్వామ్య వ్యవస్థలూ కూలిపోవడం, అదే సమయంలో ఆశించిన స్థాయిలో ఆర్థికవృద్ధి కూడా రాకపోవడం అనే అధ్వాన స్థితి.

కెవిన్ గ్రియర్, రాబిన్ గ్రియర్ పరిశోధన ప్రకారం భారత్ సరిగ్గా ఈ నాలుగో క్యాటగిరీ అయిన అధ్వానస్థితిలోనే కూరుకుపోయింది. 'గరిష్ట పాలన' దక్కలేదు, పాలనను ఉక్కుపాదంతో నడిపించినా ఊహించిన ఆర్థిక ఫలితాలూ రాలేదు. ఇందులోని అత్యంత కీలకమైన సత్యం ఏమిటంటే, 'ప్రజాస్వామ్య విలువలను కాస్త పక్కనబెడితేనే దేశం ఆర్థికంగా వేగంగా అభివృద్ధి చెందుతుంది' అనుకున్న బలమైన నాయకత్వ సిద్ధాంతం ఘోరంగా విఫలమైంది. విలువలను బలిపెట్టినా దేశానికి దక్కాల్సిన ఆర్థిక ప్రయోజనం ఏమాత్రం దక్కలేదు.

### వ్యవస్థాగత విధ్వంసం

పాలనా ఫలితాల విశ్లేషణలో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వి-డెమ్ డాటాబేస్ ఆధారంగా ఎన్నికల ప్రజాస్వామ్యం, ఉదారవాద విలువలు, కార్యనిర్వాహకవర్గంపై న్యాయ-శాసనసభల నియంత్రణలు, రాజకీయ అవినీతి, భావప్రకటన స్వేచ్ఛ, మత స్వేచ్ఛ, సమాన రక్షణ వంటి పది కీలక సంస్థాగత సూచికలను పరిశోధకులు మదింపు చేశారు. 2014 తర్వాత పదేండ్ల కాలానికి సంబంధించి లెక్కించిన వంద ఫలితాలలో, ఏకంగా తొంభై ఆరు సందర్భాల్లో భారతదేశం తన నమూనా అంచనా కంటే వెనుకబడింది. అందులో తొంభై రెండు ఫలితాలు అత్యున్నత గణాంక విశ్వసనీయతతో కూడిన స్పష్టమైన క్షీణతను నమోదు చేశాయి.

ఈ పతనం ఏదో ఒక రంగానికో లేదా సంస్థకో పరిమితం కాలేదు. 2013 నాటి ప్రాథమిక స్థాయితో పోలిస్తే ఎన్నికల ప్రజాస్వామ్యంలో అరవై శాతానికి పైగా, ఉదారవాద ప్రజాస్వామ్య స్వేచ్ఛలో దాదాపు 70 శాతం, భావప్రకటనా స్వేచ్ఛలో 56 శాతం పతనం నమోదైంది. మతస్వేచ్ఛలో అత్యంత దారుణంగా 168 శాతానికి పైగా క్షీణత కనిపించగా, చట్టం ముందు సమానత్వం, సంఘాలు పెట్టుకునే స్వేచ్ఛ, ప్రభుత్వంపై పార్లమెంట్ నియంత్రణ, చట్టపరమైన సమాన రక్షణ, న్యాయవ్యవస్థ స్వతంత్రత వంటి అంశాలన్నీ తీవ్రమైన క్షీణతను చవిచూశాయి.

ఈ ఫలితాలను బట్టి చూస్తే ప్రజాస్వామ్యం దెబ్బతింటున్నదన్న విమర్శలు కేవలం రాజకీయ ఆరోపణలో లేక విదేశీ పక్షపాతమో కావని, వాస్తవ గణాంకాలే అనే నిజాన్ని రుజువు చేస్తున్నాయని స్పష్టమవుతున్నది. ఇందులో అన్నిటికంటే రాజకీయంగా ఇబ్బందికరమైన అంశం ఏంటంటే అవినీతి గురించిన విశ్లేషణ. స్వచ్ఛమైన, అవినీతిరహిత పాలన అందిస్తాననే నినాదంతోనే మోదీ 2014లో పాలనా పగ్గాలు చేపట్టారు. కానీ కెవిన్ గ్రియర్, రాబిన్ గ్రియర్ అధ్యయనం ప్రకారం రాజకీయ అవినీతి సూచిక నమూనా అంచనాల కంటే దాదాపు 47 శాతం దిగజారింది. మోదీ కంటే ముందు అవినీతి లేదా అంటే కచ్చితంగా ఉండేది. కానీ మోదీ వచ్చాక దేశం మునుపటి కంటే స్వచ్ఛంగా మారిందా అనేదే ప్రశ్న. అలా జరుగలేదని లెక్కలు చెప్తున్నాయి. అధికారం మొత్తం ఒకరి చేతుల్లోనే కేంద్రీకృతమైతే అవినీతి దానంతటదే అంతం కాదన్న సత్యాన్ని ఈ విషయం స్పష్టంచేస్తున్నది. అధికారాన్ని కేంద్రీకరించడం వల్ల ఇతర అధికార కేంద్రాలు అణచివేతకు గురికావొచ్చు కానీ అవినీతి సమసిపోదు. అది మరింత గుంభనంగా, పారదర్శకత లేకుండా తన రూపాన్ని మార్చుకుంటుంది. +వశీస్త్రతీఖుజూష్త్రఅషె =వటవతీవఅషెవ

### సగటు పౌరుడి ఆదాయానికి గండి

మోదీ పాలనకు అసలైన కొలబద్ద ఆర్థిక సమర్థత. గుజరాత్ మాడల్ ఊపుతో దేశాన్ని తిరుగులేని స్థాయికి చేరుస్తామని మోదీ అన్నారు. పరిశోధకులు దీనిని వాస్తవ తలసరి ఆదాయం ఆధారంగా పరీక్షించారు. 2014లో పాలన చేపట్టిన కొంత కాలానికే భారత్ తన సహజ నమూనా కంటే వెనుకబడటం ప్రారంభమైంది. కాలక్రమేణా ఈ అంతరం పెరుగుతూ వచ్చింది. అధ్యయన కాలం ముగిసే నాటికి, సగటు భారతీయుడి వాస్తవ తలసరి ఆదాయం ఉండాల్సిన దానికంటే పది శాతం తక్కువగా నమోదైంది. సామాన్య పరిభాషలో చెప్పాలంటే, పాత ఆర్థిక గమనం యథావిధిగా కొనసాగి ఉంటే సగటు భారతీయుడికి రావాల్సిన వార్షిక ఆదాయంలో దాదాపు వెయ్యి డాలర్లు, అంటే సుమారు ఎనభై వేల రూపాయల కంటే ఎక్కువ గండి పడింది. దీనర్థం, దేశం వెనక్కి నడిచిందని కాదు, దేశం ఎదిగింది. కానీ ఎంత ఎదగాల్సి ఉన్నదో అంతగా ఎదగలేకపోయింది. కంటికి కనిపించే పెరుగుదల వేరు, చేజారిన సామర్థ్యం వేరు.

చేజారిన అవకాశాలు కంటికి కనిపించని నష్టాలు : పరిశ్రమ మూతపడితే కనిపిస్తుంది, ఆర్థిక సంక్షోభం వస్తే అర్థమవుతుంది. కానీ సంపాదించలేకపోయిన ఆదాయాన్ని ఎవరూ చూపించలేరు, సృష్టించలేకపోయిన ఉద్యోగాలు అధికారిక లెక్కల్లోకి రావు. రాలేకపోయిన పెట్టుబడులకు ఆనవాళ్లు ఉండవు. కానీ నిజమైన నష్టం అక్కడే దాగి ఉన్నది. వ్యవస్థలో అప్పటికే ఉన్న సహజ వేగం కంటే నాయకత్వం అదనంగా సాధించిన ప్రగతి ఏమిటన్నదే ఇక్కడ అసలైన లెక్క.

### కొవిడ్ సాకు నిలువదు

ఆర్థిక వైఫల్యాలన్నింటికీ కొవిడ్‌నే సాకుగా చూపడం సహజం. కానీ ఈ వాదనను కెవిన్ గ్రియర్, రాబిన్ గ్రియర్ తోసిపుచ్చారు. భారత ఆర్థిక వ్యవస్థ కుంటుపడటం కొవిడ్‌కు ఎంతో ముందే మొదలైంది. సంక్షోభాన్ని కొవిడ్ మరింత తీవ్రం చేసి ఉండవచ్చు కానీ, అసలు లోటు అంతకుముందే మొదలయ్యింది. కొవిడ్ విపత్తు ప్రపంచం మొత్తానికి వచ్చింది తప్ప ఒక్క భారత్‌కే పరిమితం కాలేదు. ఆ కాలాన్ని మినహాయించినా కూడా ఆర్థిక మందగమనం స్పష్టంగా కనిపించింది. అలాగే పెద్ద నోట్ల రద్దు అనేది అనుకోకుండా జరిగిన విపత్తు కాదు. చలామణిలో ఉన్న 86 శాతం కరెన్సీని రాత్రికి రాత్రే రద్దు చేయడం అనేది ప్రభుత్వం స్వయంగా తీసుకున్న విధానపరమైన నిర్ణయం. విజయాలకు క్రెడిట్ తీసుకునే పాలకులే తప్పుడు నిర్ణయాల వినాశకర ఫలితాలకూ బాధ్యత వహించాలి. నోట్ల రద్దు తెచ్చిన నష్టం కచ్చితంగా ప్రభుత్వ ఆర్థిక ఖాతాలోనే పడుతుంది. అదనంగా, 2015 తర్వాత జీడీపీ గణన పద్ధతుల్లో వచ్చిన మార్పుల వల్ల వృద్ధి రేటును కాస్త పెంచి చూపించారనే విమర్శలూ ఉన్నాయి. అదే గనుక నిజమైతే, ఈ పరిశోధన చూపించిన 10 శాతం లోటు వాస్తవంలో అంతకంటే ఎక్కువే ఉండొచ్చు.మీఖుఝుస్త్రవఎవత్

### రాజకీయ మర్మం

వ్యవస్థలు దెబ్బతిని, ఆర్థిక వ్యవస్థ తన సామర్థ్యం కంటే నెమ్మదించినా మోదీ, బీజేపీ ఎన్నికల్లో ఎలా గెలుస్తూ వచ్చారనే ప్రశ్నకు పరిశోధకులు ఎన్నికల గణితం, విపక్షాల అనైక్యతను కారణంగా చూపారు. 2014లో బీజేపీకి జాతీయ స్థాయిలో వచ్చింది కేవలం 31 శాతానికి పైగా ఓట్లే. అయినప్పటికీ మొదటి స్థానంలో నిలిచిన వారే విజేతగా నిలిచే ఎన్నికల విధానం వల్ల, విపక్షాల ఓట్లు చీలిపోవడంతో ఆ తక్కువ ఓట్ల శాతమే పార్లమెంటులో పూర్తి మెజారిటీగా మారింది. 2014లో లోక్‌సభలో గెలిచిన ఎంపీల్లో 61 శాతం మందికి కనీసం 50% ఓట్లు కూడా రాలేదు. 2024 ఎన్నికలు ఈ రాజకీయ మర్మాన్ని మరింత స్పష్టంగా చాటాయి.

దేశవ్యాప్తంగా బీజేపీ ఓట్ల శాతం పెరిగినప్పటికీ, సొంతంగా మెజారిటీ సాధించలేకపోయింది. కారణం ఒక్కటే, ఇండి కూటమి పేరుతో విపక్షాలు సమన్వయంతో పోటీ చేసి, బీజేపీ వ్యతిరేక ఓటును చీలిపోకుండా ఆపగలిగాయి. ఉత్తరప్రదేశ్ ఇందుకు ప్రబల నిదర్శనం. అక్కడ బీజేపీ తన ఓటు బ్యాంకును కాపాడుకున్నప్పటికీ, సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ కలిసి పోటీ చేయడంతో బీజేపీ సీట్లు మాత్రం గణనీయంగా పడిపోయాయి. దీనిద్వారా తేలిన సత్యం ఏంటంటే, ఎక్కువ ఓట్లు వచ్చినంత మాత్రాన సీట్లు రావాలని లేదు. విపక్షాలు చీలినప్పుడు సాధారణ ఆధిక్యతతోనూ తిరుగులేని అధికారం దక్కుతుంది. అవే విపక్షాలు ఏకమైనప్పుడు అదే ఓటు బ్యాంకు ఉన్నప్పటికీ మైనారిటీకి పడిపోవాల్సి వస్తుంది.

# ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లుపై జేపీసీ.

**న్యూఢిల్లీ :** విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లు, 2026 పై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా జాయింట్ పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేశారు. బిహార్ బీజేపీ ఎంపీ, లోక్‌సభలో బీజేపీ చీఫ్ విప్ డాక్టర్ సంజయ్ జైస్వాల్ ఈ కమిటీకి చైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్నారు. లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలతో కూడిన జాయింట్ కమిటీ, ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లు, పలు అంశాలను పరిశీలించనుంది. ఈఅఖీం జాయింట్ పార్లమెంటరీ కమిటీలో పలు రాజకీయ పార్టీలకు చెందిన ఎంపీలు ఉన్నారు. బీజేపీ నుంచి డాక్టర్ సంజయ్ జైస్వాల్, భర్తృహరి మహతాబ్, తేజస్వి సూర్య, కమలేష్ జంగ్డే, ముఖేష్ కుమార్ చంద్రకాంత్ దలాల్, డాక్టర్ నిషికాంత్ దూబే, విష్ణు దయాళ్ రామ్, అనంత్ నాయక్, అరవింద్ ధర్మపురి సభ్యులుగా ఉన్నారు. కాంగ్రెస్ తరపున ఆంటో ఆంటోనీ, కెప్టెన్ విరియాటో ఫెర్నాండెజ్, మహ్మద్ హమ్దుల్లా సయీద్, కాళీ చరణ్ ముండా ఉన్నారు.ఈ ప్యానెల్‌లోని ఇతర లోక్‌సభ ఎంపీలలో సమాజ్‌వాదీ పార్టీకి చెందిన జియా-ఉర్-రెహమాన్, టీఎంసీకి చెందిన కళ్యాణ్ బెనర్జీ, డీఎంకేకు చెందిన ఎ. రాజా, టీడీపీకి చెందిన లావు శ్రీ కృష్ణ దేవరాయలు, శివసేనకు చెందిన నరేష్ గణపత్ మస్కే, జేడీ(యూ)కి చెందిన కౌశలేంద్ర కుమార్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ-శరద్చంద్ర పవార్, ఎన్‌సీపీ-ఎస్పీకి చెందిన సుప్రియా సూలే, ఐయూఎంఎల్‌కు చెందిన ఈటీ మహమ్మద్ బషీర్ ఉన్నారు.జాయింట్ కమిటీలో రాజ్యసభ ఎంపీలు సి.సదానందన్ మాస్టర్, హర్షవర్ధన్ ష్రింగ్లా, ఉజ్వల్ దేవ్‌రావ్ నికమ్, డాక్టర్ అల్కా గుర్జార్, సత్ పాల్ శర్మ, ప్రఫుల్ పటేల్, సంజయ్ కుమార్ ఝా, క్రిస్టోఫర్ మాణికం, డాక్టర్ మేనకా గురుస్వామి, పి.విల్సన్ ఉన్నారు.

**జాబితా**

మొత్తం - 31 ఎంపీలు
లోక్‌సభ ఎంపీలు - 21
రాజ్యసభ ఎంపీలు - 10
ఎన్‌డీఏ: 19 మంది ఎంపీలు (బీజేపీ - 14, జేడీయూ - 2, టిడిపి - 1, శివసేన - 1, ఎన్సీపీ - 1).
విపక్షాలు: 12 మంది ఎంపీలు (కాంగ్రెస్ - 5, తృణమూల్ కాంగ్రెస్ - 2, డీఎంకే - 2, ఎస్పీ - 1, ఐయూఎంఎల్ - 1, ఎన్‌సీపీ-శరద్ పవార్ - 1విదేశీ విరాళాల (నియంత్రణ) చట్టం భారత్ లోకి విదేశీ నిధులు, వస్తువులు, విదేశీ సెక్యూరిటీల రాక, వినియోగాన్ని నియంత్రిస్తుంది. జాతీయ భద్రత, శాంతిభద్రతలు, ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకంగా వచ్చే విదేశీ నిధులను ఉపయోగించకుండా చూడటమే ఈ చట్టం ముఖ్య ఉద్దేశం. ప్రస్తుత ఈఅఖీం చట్టం 2010 నాటిది, దీనిని హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ అమలు చేస్తుంది. ఈ చట్టం ప్రకారం, విదేశీ విరాళాలు స్వీకరించడానికి ఎన్జీఓలు, ట్రస్టులు, సంస్థలు, ఇతర అర్హతగల సంస్థలకు ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్ లేదా అనుమతి అవసరం. వారు స్వీకరించిన విదేశీ నిధుల వినియోగం, అకౌంటింగ్‌కు సంబంధించిన సమాచారాన్ని కూడా ప్రభుత్వానికి అందించాలి.

# అవినీతిపై అసెంబ్లీలో కెసిఆర్ జవాబు చెప్పాలి

**ఉద్యమ పార్టీ బిఆర్ఎస్ లో రూ 1000 కోట్ల నిధులు ఎక్కడివి**
**కెసిఆర్ తీరుతో కుంటుపడిన గజ్వేల్ అభివృద్ధి**
**మంత్రి వివేక్ వెంకటస్వామి**




అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా

కాళేశ్వరం అవినీతిపై కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి జవాబు చెప్పాలని, లేనిపక్షంలో వెంటనే ఆయన ఎమ్మెల్యేగా రాజీనామా చేయాలని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూంకుంట ఆంక్షా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో గజ్వేల్ లో జరిగిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పేదల డబ్బుతో తెలంగాణ సాధించగా, ఆ పార్టీకి రూ 1000 కోట్ల నిధులు ఎక్కడివని నిలదీశారు. అలాగే కాళేశ్వరం ప్రాజెక్టుపై జరిగే చర్చలో కేసీఆర్ పాల్గొనాలని, అంతేకాకుండా రూ 8 లక్షల కోట్ల అప్పుపై అసెంబ్లీలో జవాబు చెప్పాలని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ఆయన అప్పుల పాలు చేసినప్పటికీ కాంట్రాక్టర్లకు, ఉద్యోగులకు బాకీ పెట్టడం సిగ్గుచేటని నిలదీశారు. మల్లన్న సాగర్ నిర్మాణంలో నిర్వాసితులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తు చేశారు. దేశంలో చిన్న రాష్ట్రమైనప్పటికీ పెద్ద పార్టీగా అవినీతి సొమ్ముతో నిధులు సమకూర్చుకున్నట్లు విమర్శించారు. ముఖ్యంగా కేసీఆర్ తీరుతో గజ్వేల్ అభివృద్ధి కుంటుపడుతోందని, ఇక్కడి ప్రజలు నమ్మి ఓట్లేసిన పాపానికి అసెంబ్లీకి వచ్చి నిధులు అడగాలని సూచించారు. పార్లమెంటులో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అధికార పక్షంపై నిప్పులు చెరుగుతుండగా, ఇక్కడి ప్రతిపక్ష నేత కేసిఆర్ మాత్రం ఫాం హౌజ్ కు పరిమితమైనట్లు చెప్పారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ప్రజల సమస్యలు పరిష్కరిస్తుండగా, గజ్వేల్ లో అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొని అభివృద్ధికి ఆటంకంగా మారినట్లు తెలిపారు. దమ్ము, ధైర్యం ఉంటే కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని, చేసిన అవినీతికి జవాబు చెప్పాలని సవాల్ విసిరారు. ఒక్కరోజు కూడా అసెంబ్లీకి రాని కెసిఆర్ కు అధికారకాంక్ష తప్ప మరేమీ లేదని వివరించారు. ఈ కార్యక్రమాల్లో డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు ఎలక్షన్ రెడ్డి, భూమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వైస్ విజయ మోహన్, వైస్ చైర్మన్లు సర్దార్ ఖాన్, ప్రభాకర్ గుప్త, పీసీసీ నాయకులు నాయిని యాదగిరి,

మజీద్ కమిటీ చైర్మన్ మతీన్, మైనార్టీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షులు సమీర్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు అశోక్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు సుఖేందర్ రెడ్డి, నేతలు మోనగారి రాజు, సారిక శ్రీనివాస్ రెడ్డి, కొండల్ రెడ్డి, రేగొండ గౌడ్, రాములు గౌడ్, రమేష్ గౌడ్, గాడిపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# హామీలు నెరవేర్చని రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి

**రైతుబంధు సమితి రాష్ట్ర మాజీ కో ఆర్డినేటర్ దేవి రవీందర్**



అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి అమలు కాలేదని రైతుబంధు సమితి రాష్ట్ర మాజీ కోఆర్డినేటర్ దేవి రవీందర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటలను మరిచి ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. ఎన్నికల ముందు "100 రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం" అని చెప్పిన కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారెంటీలు ఇచ్చిన 420 హామీల్లో ఎన్ని అమలు చేశారో రేవంత్ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.రైతులను నట్టేట ముంచిన ప్రభుత్వం రైతుల సంక్షేమం పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సకాలంలో రైతుబంధు ఇవ్వక సగం సగం రుణమాఫీ తులం బంగారం మరిచి ఉచిత బస్సుతో మగవాళ్లకు బస్సు ఛార్జ్ లు పెంచి ఇంటికి ఉచిత కరెంటు పేరుతో రైతులకు నిరంతరాయమైన కరెంటు కట్ చేసి తొమ్మిది గంటల కరెంటుతో రైతులను ఇబ్బంది పెడుతున్నారు గతంలో రైతులకు అండగా నిలిచిన రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలపై స్పష్టత లేకుండా చేసి రైతుల్లో ఆందోళన కలిగించారని విమర్శించారు.రైతులకు ఇచ్చిన హామీలు, రుణమాఫీ, రైతు భరోసా, పంటలకు గిట్టుబాటు ధర, బోనస్ వంటి అంశాల్లో ప్రభుత్వం ఇచ్చిన మాటకు, చేస్తున్న పనులకు పొంతన లేదని అన్నారు."రైతు ఓటు అడిగేటప్పుడు దేవుడయ్యాడు.. ఓటు వేసిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతు ఇప్పుడు దయమయ్యారు.సొంత ఎమ్మెల్యేలకే స్వేచ్ఛ లేదా?రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై సొంత కాంగ్రెస్ ఎమ్మెల్యేలే "మా ప్రభుత్వంలో స్వేచ్ఛ లేదు" అంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పరిస్థితి వచ్చిందని వారు అన్నారు. ప్రతిపక్షాల మాటలు కాదిది. మీ సొంత ఎమ్మెల్యేలే మీ ప్రభుత్వంలో స్వేచ్ఛ లేదని చెబుతున్నారు. ప్రజాస్వామ్యంలో ఎమ్మెల్యేలకే మాట్లాడే స్వేచ్ఛ లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటి? ఇదేనా కాంగ్రెస్ చెప్పిన ఇందిరమ్మ రాజ్యం?" అంటూ ప్రశ్నించారు.సొంత పార్టీ ఎమ్మెల్యేల గొంతుకే సంకెళ్లు వేస్తూ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడడం విడ్డూరం వెయ్యి రోజుల పాలనపై టిఆర్ఎస్ పార్టీ ప్రశ్నిస్తుంటే జీర్ణించుకోలేక అక్రమ కేసులు పెడుతూ ఇబ్బందుల గురి చేస్తున్నారు.మీ అక్రమ కేసులకు ఎవరు భయపడరు ప్రజల కోసం మీ ప్రభుత్వం మెడలు వంచి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూనే ఉంటాం "కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలు మరిచిపోలేదు. ఎన్నికల సమయంలో చెప్పిన ప్రతి మాటను ప్రజలు గుర్తుపెట్టుకున్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి హామీలు నెరవేర్చినటువంటి పరిస్థితులలో రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు రమేష్ గౌడ్ భాస్కర్ శిల్పా నర్సింలు మాజీ సర్పంచులు మైపాల్ కిరణ్ ఉప సర్పంచ్ నాగరాజు కిషన్ కనకయ్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ ఫాంహౌజ్ వీడి అసెంబ్లీకి రా

**నమ్మి ఓట్లేసిన గజ్వేల్ ప్రజల సమస్యలు పరిష్కరించు**
**కేటీఆర్ గత చరిత్ర తెలుసుకొని మాట్లాడు**
**సోనియా తెలంగాణ ఇవ్వకుంటే మీ గతి ఏమిటి**
**రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, సీనియర్ నేత వి హనుమంతరావు**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా** కెసిఆర్ ఎర్రవల్లి ఫాంహౌజ్ వీడి అసెంబ్లీకి రావాలని, నమ్మి ఓట్లేసిన గజ్వేల్ ప్రజల సమస్యలు తీర్చాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హనుమంత రావు స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తూశీకుంట అంక్షారెడ్డి ఆధ్వర్యంలో గజ్వేల్ లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేసి వెలుగు నింపుతుండగా, మరింత రాష్ట్ర అభివృద్ధి కోసం తగు సూచనలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీని దేవత అన్న కెసిఆర్ కాళ్లు మొక్కి నక్క వినయం నటించగా, ప్రస్తుతం రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే కాంగ్రెస్ పై విమర్శలు చేసే ముందు కేటీఆర్ గత చరిత్ర తెలుసుకోవాలని హితవు పలకగా, చంద్రబాబు, కెసిఆర్ లాంటి వ్యక్తులకు కాంగ్రెస్ రాజకీయ బిక్ష పెట్టిందని గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు సమయంలో సోనియాగాంధీని దేవతగా అభివర్ణించిన కేసీఆర్ కుటుంబం ఇప్పుడు వారిపైనే విమర్శలు చేయడం రాజకీయ దిగజారుడు తనానికి నిదర్శనమని మండిపడ్డారు. రాజకీయ పరిణతి సాధించని కేటీఆర్ తన పద్ధతి, వ్యవహార శైలి మార్చుకోవాలని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. గజ్వేల్ ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన కేసీఆర్ దర్శనం కష్టంగా మారిందని, ప్రభుత్వ జీతభత్యాలు పొందుతున్న ఆయన ముఖం చాటేస్తే ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. ఇక్కడి ప్రజల సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీలో కొట్లాడి నిధులు సాధించాలని, అయితే ఇవ్వడానికి సీఎం రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనతో ప్రజలు బేరీజు వేసుకొని హర్షం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా అయోధ్య రాముడుతో రాజకీయం చేస్తున్న బిజెపి సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన అడ్డుకొని తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నట్లు ఎద్దేవా చేశారు. పెట్టుబడులు సాధించడానికి ఆయన విదేశీ పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తుంటే రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం చూసి ఓర్వలేక బీఆర్ఎస్, బీజేపీ నేతలు కారుకూతలు కూస్తున్నట్లు విమర్శించారు. రాజకీయ కోసం రాష్ట్ర ప్రయోజనాలు అడ్డుకోవడం సరికాదని పేర్కొంటూ కేంద్ర నిధులు సాధించాల్సిన ఇక్కడి బిజెపి మంత్రులు, ఎంపీలు ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరిట దీక్షలు చేయడం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమే అవుతుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ చరిత్రను ఎవరూ చెరిపేయలేరని, దేశ రాజకీయాల్లో కాంగ్రెస్ పాత్రను తక్కువ చేసి చూపించే ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవని



ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో 10 ఏళ్ల పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూశీకుంట నర్సారెడ్డి, డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి, భూంరెడ్డి ఏఎంసీ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, విరుపాక శ్రీనివాస్‌రెడ్డి, విజయ మోహన్, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, పీసీసీ నాయకులు నాయిని యాదగిరి నియోజకవర్గ కాంగ్రెస్ కమిటీ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మండలాల సర్పంచుల ఫోరం అధ్యక్షులు అశోక్ రెడ్డి, వెంకటేష్ ముదిరాజ్, మండలాల బాధ్యులు సుఖేందర్ రెడ్డి, అశోక్, నరసింహారెడ్డి, రవీందర్ రెడ్డి మైనార్టీ నాయకులు మతీన్ సమీర్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డయాలసిస్ బెడ్లు పెంచాలి

**సింగరేణి సీఎంఓకు స్వచ్ఛంద సంస్థల ఐక్యవేదిక వినతి**

**అగ్నిధారన్యూస్ గోదావరిఖని సెప్టెంబర్ 5 ఆర్జీ-1**
గోదావరిఖని సింగరేణి ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ బెడ్లు, యంత్రాల సంఖ్యను 10కి పెంచాలని స్వచ్ఛంద సంస్థల ఐక్యవేదిక ప్రతినిధులు కోరారు. శనివారం ఆస్పత్రికి వచ్చిన సీఎంఓ డాక్టర్ కిరణ్‌రాజ్‌కు ఐక్యవేదిక అధ్యక్షుడు అయిత శివ, గౌరవ అధ్యక్షుడు మద్దెల దినేష్ వినతిపత్రం అందజేశారు. సింగరేణి పరిధిలో గోదావరిఖని, భూపాలపల్లిలో మాత్రమే డయాలసిస్ కేంద్రాలు ఉండటంతో బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్, 8వ కాలనీ, సెంటినరీ కాలనీ తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు వస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఐదు యంత్రాలు సరిపోవడం లేదని, 12 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన యంత్రాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని పేర్కొన్నారు. పాత యంత్రాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయడంతో పాటు సింగరేణి సీఎస్ఆర్, డీఎంఎఫ్‌టీ నిధులను కార్మికుల ఆరోగ్యానికి వినియోగించాలని కోరారు. దీనిపై సీఎంఓ స్పందిస్తూ త్వరలో కొత్త డయాలసిస్ యంత్రాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.



## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా

జగదేవపూర్ మండలం లోని పలుగు గడ్డ గ్రామానికి చెందిన చెక్కల రమేష్ తల్లి చెక్కల గంగమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలుగు గడ్డ గ్రామ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు పిట్టల అంజయ్య ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు అనంతరం వారి కుటుంబానికి రూ. 5,000/- రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు పిట్టల అంజయ్య మాట్లాడుతూ చెక్కల గంగమ్మ అనారోగ్యంతో మృతి చెందడం చాలాబాధాకరం అన్నారు, బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. వీరితో పాటుగా గ్రామ మాజీ సర్పంచ్ రాజేశ్వరి రవి, గ్రామ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు నర్ర పెద్ద కనకయ్య, గువ్వ రమేష్, లింగాల కనకయ్య, చెక్కల కృష్ణ, సుధాకర్, కృష్ణ, అరుముల్ల నర్సింలు, పిట్టల లక్ష్మణ్, లోకుల ప్రశాంత్, కనకరాజు, కమలాకర్, రామచంద్రం , పెద్దులు, పాండు, సుదర్శన్, నర్సింలు, రాజయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికి బాకీ కార్డు పంపిణీ చేసిన బి ఆర్ ఎస్ నాయకులు బుద్ధ నాగరాజు



అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా

జగదేవపూర్ మేజర్ గ్రామపంచాయతీ లో బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బుద్ధ నాగరాజు ఆధ్వర్యంలో ఇంటింటా బాకీ కార్డు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధ నాగరాజు మాజీ ఎంపీటీసీ కవిత శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చ లేదంటూ ప్రజలకు ప్రభుత్వం బాకీ ఉన్న వివరాలతో కూడిన కార్డులు ఇంటింటికి పంపిణీ చేశామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు గడుస్తున్న ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, కెసిఆర్ చేసిన అభివృద్ధి తప్ప కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి ఏమి లేదని, ప్రజలు మళ్లీ కేసీఆర్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇప్పటికైనా నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి ధర్నాలు రాస్తారోకోలు చేయడం సిగ్గుచేటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మచ్చ గణేష్ వార్డ్ సభ్యులు మచ్చ బాబు బచ్చలి భాస్కర్ బండ శ్రీనివాస్ ,బాల్ నర్సయ్య ,డప్పు సాయి,ఇస్మాయిల్ బీ ఆర్ ఎస్ సీనియర్ నాయకులు దాచారం కనకయ్య కొంపల్లి మహేష్ దండే భాస్కర్ సూరమ్మ గారి వెంకట్ రెడ్డి ప్రశాంత్ బాల కృష్ణ ఐలయ్య శ్రీకాంత్ నాగరాజు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మునిగడప ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా

జగదేవపూర్ మండలంల మునిగడప గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని విద్యార్థులు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారత మాజీ రాష్ట్రపతి, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముందుగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు పాఠశాల ప్రాంగణంలో విద్యాబుద్ధులు నేర్పుతున్న ఉపాధ్యాయ బృందానికి ఘనంగా సన్మానం చేసి, శాలువాలు, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. సమాజ నిర్మాణంలో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు పోషిస్తున్న పాత్ర అమూల్యమైనదని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్యామల ఉపాధ్యాయుల బృందం సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని శతాబ్ది ఆధ్వర్యంలో కార్యక్రమం**

అగ్ని ధార న్యూస్,(రామగుండం) :

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని శతాబ్ది ఆధ్వర్యంలో శనివారం ఎన్టీపీసీ సింధూరా ఇంజినీరింగ్ కాలేజీ రోడ్డులోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్, బచ్పన్ ప్లే స్కూల్‌లో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యా యులకు శాలువాలు కప్పి, మొమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు లయన్ మాచీడి మహేంద్ర గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకమన్నారు. విద్యాబోధనతో పాటు విద్యార్థుల్లో విలువలు, నైపుణ్యాలు, క్రమశిక్షణను పెంపొందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రతి విద్యార్థి తన జీవితంలో గురువుల సేవలను



గుర్తించి గౌరవించాలని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యుడు కంకణాల రవిచంద్ర, అకాడమిక్ హైట్స్ ప్రిన్సిపాల్ ఆయేషా, వైస్ ప్రిన్సిపాల్ హేమ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సౌజన్య, బచ్పన్ ప్లే స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలేఖ, పీఈటీ రాము, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నిధార

# రైతు సంక్షోభానికి ధర ఒక్కటే కారణం కాదు

**ఆహార--పర్యావరణ--ఉపాధి సంక్షోభం నుంచి బయటపడేదెలా**

**దహేగామా ఉమామహేశ్వరరావు, సామాజిక పర్యావరణవేత్త, ఎన్టీపీసీ--రామగుండం**

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం) :**

భారతీయ వ్యవసాయ రంగం నేడు అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. రైతుకు పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడం ఈ సంక్షోభంలో ఒక ముఖ్యమైన అంశమే అయినప్పటికీ.. సమస్యకు అదొక్కటే కారణం కాదు. చిన్నచిన్న భూకమతాలు, నీటి కొరత, నేల సారం క్షీణించడం, పెరుగుతున్న సాగు వ్యయాలు, నిల్వ సదుపాయాల కొరత, మార్కెట్ అసమానతలు, వాతావరణ మార్పులు.. ఇవన్నీ కలిసి రైతు జీవితాన్ని సంక్లిష్టంగా మారుస్తున్నాయి.దేశ జనాభాలో గణనీయమైన వర్గానికి వ్యవసాయం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నప్పటికీ.. ఆ రంగం నుంచి వచ్చే ఆదాయం రైతు కుటుంబాల జీవన ప్రమాణాలను ఆశించిన స్థాయిలో మెరుగుపరచలేకపోతోంది. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత పెరుగుతున్నా, దాని ప్రయోజనాలు రైతు, వ్యవసాయ కూలీలకు సమానంగా చేరకపోవడం ప్రధాన సమస్య.



### చిన్న కమతాలే పెద్ద సవాలు

దేశంలో చిన్న, సన్నకారు రైతులే అత్యధికంగా ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి రైతు విడివిడిగా యంత్రాలు కొనుగోలు చేయడం, నిల్వ వసతులు ఏర్పాటు చేసుకోవడం, మార్కెట్‌ను వెతుక్కోవడం ఆర్థికంగా సాధ్యం కాదు. అందుకే భూములను కలపడం కంటే ఉత్పత్తిని, వనరులను సమష్టిగా నిర్వహించడం అవసరం.రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (FPO\T) ఈ దిశగా కీలక పాత్ర పోషించగలవు. యంత్రాలు, సాగునీటి వనరులు, నిల్వ కేంద్రాలు, రవాణా సదుపాయాలను ఉమ్మడిగా వినియోగించుకుని.. ఉత్పత్తులను సమష్టిగా మార్కెట్ చేయడం ద్వారా రైతుల బేరసారాల శక్తి పెరుగుతుంది.

### యాంత్రీకరణకు కొత్త దిశ

ఆధునిక వ్యవసాయంలో డ్రోన్లు, సెన్సార్లు, డిజిటల్ సాంకేతికత వంటి వాటి వినియోగం పెరగాలి. అయితే ప్రతి రైతు సొంతంగా ట్రాక్టర్, ఇతర ఖరీదైన యంత్రాలు కొనుగోలు చేయాలనే విధానం ఆచరణ సాధ్యం కాదు. 'మెషీన్ యాజ్ ఏ సర్వీస్' విధానం ద్వారా రైతులకు అవసరమైన సమయంలో యంత్రాలను అద్దెకు అందించే వ్యవస్థను గ్రామస్థాయిలో బలోపేతం చేయాలి. దీనివల్ల పెట్టుబడి భారం తగ్గడంతో పాటు వ్యవసాయంలో నైపుణ్యం, ఉత్పాదకత పెరుగుతుంది.

### నీరు.. నేలే అసలు సంపద

వ్యవసాయ భవిష్యత్తు నీరు, నేల ఆరోగ్యంపైనే ఆధారపడి ఉంది. అధిక నీటి వినియోగం జరిగే సాగు పద్ధతులను క్రమంగా తగ్గించి, డ్రిప్, స్ప్రింక్లర్ వంటి నీటి పొదుపు విధానాలను విస్తరించాలి. ప్రతి ప్రాంతానికి అనుగుణంగా భూగర్భ జలాల వినియోగంపై శాస్త్రీయంగా 'వాటర్ బడ్జెట్' రూపొందించాలి.అదే సమయంలో నేలలో సేంద్రియ కర్బనాన్ని పెంచడం, నేల కోతను అరికట్టడం, పంటల మార్పిడి వంటి సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలి. నేల ఆరోగ్యం దెబ్బతింటే తాత్కాలికంగా ఉత్పత్తి పెరిగినా.. దీర్ఘకాలంలో వ్యవసాయమే సంక్షోభంలో పడుతుంది.

### ముడి పంట కాదు.. విలువ జోడించిన ఉత్పత్తి

రైతు పండించిన పంటను ముడి సరుకుగా విక్రయించడంతో రైతుకు లభించే ఆదాయం పరిమితంగానే ఉంటుంది. అదే పంటను గ్రామీణ స్థాయిలో శుద్ధి చేసి, ప్యాకేజింగ్, ప్రాసెసింగ్ చేసి మార్కెట్‌కు అందిస్తే విలువ గణనీయంగా పెరుగుతుంది. అందుకే గ్రామీణ ప్రాంతాల్లోనే అగ్రో ప్రాసెసింగ్ కేంద్రాలు, కోల్డ్ స్టోరేజీలు, రవాణా--లాజిస్టిక్స్ వసతులు అభివృద్ధి చేయాలి. వ్యవసాయంతో పాటు గ్రామీణ యువతకు ఉపాధి కల్పించే అగ్రో--ఇండస్ట్రియల్ వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఉంది.

### పరిహారం కంటే ముందస్తు రక్షణ

వాతావరణ మార్పులు వ్యవసాయానికి కొత్త ముప్పులను తెస్తున్నాయి. అధిక వర్షాలు, కరువులు, ఉష్ణోగ్రతల పెరుగుదల, కొత్త తెగుళ్లు రైతు ఆదాయాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. విపత్తు సంభవించిన తర్వాత పరిహారం అందించడం మాత్రమే పరిష్కారం కాదు.

వాతావరణ మార్పులను తట్టుకునే క్లైమేట్-రెసిలియంట్ వ్యవసాయం వైపు రైతులను మళ్లించాలి. తక్కువ నీటితో పండే పంటలు, స్థానిక వాతావరణానికి అనుకూలమైన వంగడాలు, పంటల వైవిధ్యం, ముందస్తు వాతావరణ హెచ్చరిక వ్యవస్థలు రైతులకు అందుబాటులోకి రావాలి.

### వ్యవసాయంతోపాటు ప్రత్యామ్నాయ ఉపాధి

ప్రతి ఒక్కరినీ వ్యవసాయంలోనే కొనసాగించాలనే సంప్రదాయ విధానం ఇక మారాలి. వ్యవసాయంలో అవసరమైనంత శ్రామిక శక్తి అధిక ఉత్పాదకతతో పనిచేసేలా చూడడంతో పాటు, మిగిలిన గ్రామీణ యువతకు అగ్రో ప్రాసెసింగ్, లాజిస్టిక్స్, గ్రామీణ సేవలు, పునరుత్పాదక ఇంధనం వంటి రంగాల్లో నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించాలి.ఇది వ్యవసాయంపై ఒత్తిడిని తగ్గించడమే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుంది.

### కొత్త సామాజిక ఒప్పందం అవసరం

రైతు సంక్షేమం అంటే కేవలం రుణమాఫీలు, సబ్సిడీలు, పరిహారాలతో ముగిసే అంశం కాదు. రైతుకు నాణ్యమైన విద్య, సాంకేతిక పరిజ్ఞానం, సాగునీరు, నిల్వ వసతులు, రవాణా, మార్కెట్ భద్రత, ఆర్థిక రక్షణ కల్పించడం ప్రభుత్వ బాధ్యత. అదే సమయంలో రైతులు కూడా నేల సంరక్షణ, నీటి పొదుపు, సుస్థిర వ్యవసాయ పద్ధతులను స్వీకరించాల్సిన అవసరం ఉంది.

వ్యవసాయ విధానాలను కేవలం 'ఎన్ని టన్నులు పండించాం.. ఎన్ని హెక్టార్లు సాగు చేశాం' అనే లెక్కలతో కాకుండా.. 'రైతు నికర ఆదాయం ఎంత పెరిగింది? ఒక యూనిట్ నీటితో ఎంత ఉత్పత్తి సాధించాం నేల ఆరోగ్యం ఎలా ఉంది?' అనే ప్రమాణాలతో అంచనా వేయాలి. రైతు సంక్షోభానికి తాత్కాలిక ఉపశమనాలు కాకుండా దీర్ఘకాలిక, సమగ్ర పరిష్కారాలే అవసరం. రైతు ఆదాయం పెరగడం, ప్రకృతి వనరులు పరిరక్షించబడటం, గ్రామీణ యువతకు ఉపాధి లభించడం.. ఈ మూడింటినీ సమన్వయం చేసినప్పుడే ఆహార భద్రతతో పాటు పర్యావరణ పరిరక్షణ, గ్రామీణ ఉపాధి భద్రత సాధ్యమవుతుంది. అదే భారత వ్యవసాయ భవిష్యత్తుకు బలమైన పునాది.

## జ్వరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి




**ప్రభుత్వ ఆసుపత్రులను అప్రమత్తం చేయాలి: డా. మార్షల్ దుర్గం నగేష్**

**అగ్ని ధార న్యూస్ ,(పెద్దపల్లి) :**

జిల్లాలో సీజనల్ వ్యాధులు, వైరల్ ఇన్ఫెక్షన్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం, వైద్య ఆరోగ్యశాఖ వెంటనే అప్రమత్తం కావాలని సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్షల్ దుర్గం నగేష్ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పులతో జ్వరాల తీవ్రత పెరుగుతోందని, ప్రభుత్వ ఆసుపత్రులకు రోగుల తాకిడి పెరుగుతున్నదని తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, అత్యవసర మందులు, రక్త పరీక్షలతో పాటు డెంగ్యూ, మలేరియా నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉంచాలని సూచించారు. పేద, మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపైనే ఆధారపడుతున్నందున 24 గంటల వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అధిక ఫీజుల వసూళ్లపై జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని అన్నారు.జ్వరాలకు కారణమవుతున్న దోమల నియంత్రణకు ఫాగింగ్, మందుల పిచికారీ, నిల్వ నీటి తొలగింపు, పారిశుధ్య కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు ప్రతి పట్టణం, గ్రామంలో పారిశుధ్య చర్యలను ముమ్మరం చేయాలని కోరారు. ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలని డా. మార్షల్ దుర్గం నగేష్ ప్రభుత్వాన్ని కోరారు.

## గురువుల సేవలు అమూల్యం



**సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర విశిష్టం**

**అగ్నిధార న్యూస్,( రామగుండం) :**

విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని శతాబ్ధి అధ్యక్షుడు ఎల్ఎన్. మాచిడి మహేందర్ గౌడ్ అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రామగుండం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన 32 మంది ఉపాధ్యాయులను శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. విద్యతోపాటు క్రమశిక్షణ, నైతిక విలువలు బోధిస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న గురువుల సేవలు అమూల్యమని మహేందర్ గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ శారద అజ్మీరా, ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ జనరల్ సెక్రటరీ ఎల్ఎన్. పైడ సాయి కుమార్, క్లబ్ డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.

## గురువుల సేవలు అమూల్యం

**సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర విశిష్టం**

**అగ్నిధార న్యూస్,( రామగుండం) :**

విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని శతాబ్ధి అధ్యక్షుడు ఎల్ఎన్. మాచిడి మహేందర్ గౌడ్ అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రామగుండం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన 32 మంది ఉపాధ్యాయులను శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. విద్యతోపాటు క్రమశిక్షణ, నైతిక విలువలు బోధిస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న గురువుల సేవలు అమూల్యమని మహేందర్ గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ శారద అజ్మీరా, ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ జనరల్ సెక్రటరీ ఎల్ఎన్. పైడ సాయి కుమార్, క్లబ్ డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.

## సంధ్య విజయం విద్యార్థులకు స్ఫూర్తిదాయకం

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం,):**

పట్టుదల, కృషి ఉంటే ఎలాంటి పరిస్థితుల్లోనైనా లక్ష్యాన్ని సాధించవచ్చని వానరాశి సంధ్య తన విజయంతో నిరూపించిందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి అన్నారు. రామగుండం తబిత ఆశ్రమంలో చిన్ననాటి నుంచి పెరిగిన సంధ్య నీట్‌లో ప్రతిభ కనబరిచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించడం అభినందనీయమన్నారు.కుటుంబ పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా తబిత ఆశ్రమ నిర్వాహకులు వీరేందర్ నాయక్ సంధ్యకు తల్లిదండ్రుల్లా అండగా నిలిచి విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందించారని తెలిపారు. సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ప్రాథమిక విద్య, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన సంధ్య.. పరిమితులను అధిగమించి వైద్య విద్యలో సీటు సాధించడం ప్రతి విద్యార్థికి ఆదర్శమన్నారు.సంధ్యను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఆమెను ప్రోత్సహించిన ఆశ్రమ నిర్వాహకులు వీరేందర్ నాయక్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో చిలువేరు కుమార్, వంశీ, సింగారం శ్రీకాంత్, అనగంటి యశ్వంత్, దుర్గా జ్ఞానేశ్వర్, బోనగిరి వీరయ్య, దుర్గా గంగు, అనగంటి సుమంత్, సాగర్ సుశాంత్, సునాని లలిత్ తదితరులు పాల్గొన్నారు.

## 22-ఏ జీవోపై బీజేపీ సమరశంఖం

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం) :** 22-ఏ జీవో నిబంధనలతో భూముల హక్కులు కోల్పోయి ఇబ్బందులు పడుతున్న రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహిస్తున్న మహా దీక్షకు రామగుండం నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్‌కు బయలుదేరారు.ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ.. 22-ఏ నిబంధనల కారణంగా భూములపై హక్కులు కోల్పోయిన రైతులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే రైతుల సమస్యలను పరిష్కరించి, వారికి భూములపై పూర్తి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల హక్కుల కోసం నిర్వహిస్తున్న మహా దీక్షను విజయవంతం చేసేందుకు రామగుండం నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లినట్లు తెలిపారు.కార్యక్రమంలో బీజేపీ లేబర్ సెల్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు తడగొండ నర్సయ్య, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు ఎల్తూరి సరిత, మండల అధ్యక్షులు గుండబోయిన భూమయ్య, బోడకుంటి సుభాష్‌తో పాటు పరకాల మురళీగౌడ్, ఎల్తూరి రాజయ్య, కొట్టె నరేష్, అందె రాజ్‌కుమార్‌చారి, జక్కన బాలు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ జహీర్ జన్మదిన వేడుకలు



**శుభాకాంక్షలు తెలిపిన మీడియా మిత్రులు**

**అగ్నిధారన్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి పట్టణంలో ఐజేయు మండల అధ్యక్షుడు జహీర్ జన్మదిన వేడుకలను మీడియా మిత్రులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జహీర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.జహీర్ మరిన్ని పుట్టిన రోజులు ఆనందంగా జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో పాటు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని మీడియా మిత్రులు ఆకాంక్షించారు. జర్నలిజం రంగంలో ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జహీర్ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో, ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు అభిమానులు పెద్ద పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో హనుమాన్ దేవాలయం దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన పవిత్ర యజ్ఞ కార్యక్రమంలో , ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మాణం పూర్తయిన ఐదు ఇళ్లను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించి, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే స్మార్ట్ కార్డులు, రేషన్ కార్డులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అదేవిధంగా ఎచ్ ఎం డి ఎ నిధులతో .40 లక్షల వ్యయంతో చేపట్టనున్న యూ ఎస్ జి మరియు సి సి రోడ్డు పనులకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గ్రామ ప్రజలతో మమేకమై, గ్రామ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాలను ప్రజలకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో, మార్కెట్ కమిటీ చైర్మన్ గీతా నరసింహ,వైస్ ఛైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డి,మాజీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు భగవన్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మరియు ప్రజా ప్రతినిధులు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు మరియు అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సేవలు సమాజ నిర్మాణంలో కీలకం



**అగ్ని ధార న్యూస్,( హైదరాబాద్):** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంతో పాటు ఉత్తమ పౌరులను అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య అన్నారు. తెలంగాణ బీజేపీ టీచర్స్ సెల్ ఆధ్వర్యంలో శనివారం ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించిన డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కొమరయ్య మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యాబోధనతో పాటు విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుత ఆలోచనా విధానాన్ని పెంపొందించాలని సూచించారు. ఆధునిక సాంకేతికతను విద్యతో అనుసంధానం చేసి విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించాలన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రతి ఉపాధ్యాయుడికి ఆయన ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో బీజేపీ టీచర్స్ సెల్ రాష్ట్ర కన్వీనర్ కొణిజెర్ల శ్రీనివాస్, కో-కన్వీనర్లు సుమన్‌రావు, శివకృష్ణ, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి పేద ప్రజలకు వరం

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**



సీఎం సహాయనిధి పేదలకు వరమని బి జి వెంకటాపూర్ సర్పంచ్ చెక్కల పరమేశ్వర్ అన్నారు.మాందాపూర్ గ్రామానికి చెందిన లింగాల లత భర్త మహేందర్ అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, వైద్య ఖర్చుల కోసం అధిక మొత్తంలో డబ్బు ఖర్చు చేయాల్సి వచ్చింది. దీంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న కుటుంబానికి అండగా నిలిచేందుకు సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి సహకారం, ప్రత్యేక చొరవతో సీఎం సహాయనిధి ద్వారా రూ.18,500 ల ఆర్థిక సహాయం మంజూరైంది. మంజూరైన రూ.18,500 రూపాయల చెక్కును బి.జి. వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ చెక్కల పరమేశ్వర్,మాందాపూర్ గ్రామ సర్పంచ్ లింగాల మౌనిక ముత్యం చేతుల మీదుగా లబ్ధిదారుడు మహేందర్ కుటుంబానికి అందజేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ, తమ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సమయంలో సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా ప్రత్యేక చొరవ తీసుకున్న ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి కి, అలాగే సహకరించిన బి.జి. వెంకటాపూర్ మాందాపూర్ గ్రామాల సర్పంచులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.పేద, మధ్యతరగతి కుటుంబాలకు అనారోగ్య సమయంలో సీఎం సహాయనిధి ఎంతో భరోసా కల్పిస్తుందని, ఆపద సమయంలో ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు.వీరితోపాటుగా నాయకులు జహంగీర్ మహేష్, మహేందర్,లింగాల ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

# ధర్మాన్ని కాపాడుతూ.. కర్తవ్యాన్ని నిర్వర్తించడమే శ్రీకృష్ణుడి సందేశం.

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)



కడ్తల్ మండలం బాలాజీనగర్ తండాలోని ధనరాశి శ్రీ రాధాకృష్ణ దేవాలయంలో రెండు రోజులుగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సి ఓ ఓ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆలయాన్ని సందర్శించి శ్రీ రాధాకృష్ణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

శ్రీకృష్ణుడు ధర్మాన్ని స్థాపించి, అధర్మాన్ని నిర్మూలించేందుకు అవతరించిన దైవ స్వరూపమని,ఆయన జీవితం సత్యం, ధర్మం, న్యాయం, కర్తవ్యనిష్ఠ వంటి విలువలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు,భగవద్గీత ద్వారా ప్రపంచానికి అందించిన కర్మయోగ సందేశం మానవాళికి శాశ్వత మార్గదర్శకమని, ఫలితాన్ని ఆశించకుండా కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వర్తించాలనే బోధ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. యువత శ్రీకృష్ణుడి బోధనల నుంచి స్ఫూర్తి పొంది క్రమశిక్షణతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు, మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి పండుగలు ఎంతో ముఖ్యమని అన్నారు,శ్రీ రాధాకృష్ణ స్వామివారి కృపతో బాలాజీనగర్ తండా ప్రజలతో పాటు నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యా లతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో,ఆలయ నిర్వాహకులు భావోజీ బిచ్యా నాయక్,ప్రవచనకర్త శ్రీనివాస్ తో పాటు హరి నాయక్, ధర్మానాయక్,రాములు,పరశురామ్ మరియు స్థానిక ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి--యువత హక్కుల కోసం సాగిన పోరాటం..

**ర్యాలీలో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్ రెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)



కల్వకుర్తి పట్టణ కేంద్రంలో పట్టణ విద్యార్థులు, నిరుద్యోగ యువత హక్కుల సాధన కోసం చేపట్టిన భారీ ర్యాలీ కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రంలో విజయవంతంగా జరిగింది. ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ వంటి ప్రధాన డిమాండ్ల సాధన కోసం తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీకి విద్యార్థులు, నిరుద్యోగ యువత, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా గళం వినిపించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ర్యాలీలో విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని తమ డిమాండ్లపై నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సక్రమంగా అమలు చేయాలి, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి, యూత్ డిక్లరేషన్‌లో పేర్కొన్న హామీలను అమలు చేయాలి అంటూ నినాదాలు చేశారు. దీంతో కల్వకుర్తి పట్టణంలో యువత నినాదాలతో సందడి నెలకొంది. ఈ సందర్భంగా గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థి--యువత హక్కుల కోసం నిర్వహించిన ఈ ర్యాలీని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత చూపించిన పోరాట స్ఫూర్తి, ఐక్యత అభినందనీయమన్నారు. యువత భవిష్యత్తు కోసం తమ గళాన్ని మరింత బలంగా వినిపించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మన హక్కుల కోసం.. మన భవిష్యత్తు కోసం యువత ఒక్కటై కదిలింది. కల్వకుర్తి గడ్డపై యువ గర్జన మార్మోగింది" అని గోలి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ఉద్యమానికి అండగా నిలిచిన ప్రతి విద్యార్థికి, ప్రతి యువకుడికి, నాయకులకు, కార్యకర్తలకు, ప్రజా ప్రతినిధులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థి--యువత సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులోనూ ప్రజా ఉద్యమాలను కొనసాగిస్తామని తెలిపారు.

# కుట్టుమిషన్ల శిక్షణ మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ

**గ్రామ సర్పంచ్ పరమేశ్వర్, యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ గేము నాయక్, కోఆర్డినేటర్ మొహమ్మద్ నజీమ్ అలీ**

అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా



జగదేవపూర్ మండలం బి.జి వెంకటాపూర్ బి.జి గ్రామపంచాయతీ పరిధిలో రాసేటి మారి ఆధ్వర్యంలో గత కొద్దిరోజుల క్రితం నిర్వహించిన కుట్టుమిషన్ల శిక్షణ తరగతులను విజయవంతంగా పూర్తి చేసిన మహిళలకు శనివారం సర్టిఫికెట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పరమేశ్వర్, యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ గేము నాయక్, కోఆర్డినేటర్ మొహమ్మద్ నజీమ్ అలీ, మారి సంస్థ ప్రతినిధుల ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్లు అందుకున్న మహిళలు ఆనందం వ్యక్తం చేస్తూ, కుట్టుమిషన్ల శిక్షణ ద్వారా తమకు స్వయం ఉపాధి పొందే అవకాశం కల్పించిన రాసేటి , మారి సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. శిక్షణ ద్వారా నేర్చుకున్న నైపుణ్యాలను ఉపయోగించుకొని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాబు, వార్డు మెంబర్ యాదగిరి, బాలరాజు,ఐకేపీ ఎఛ బాబు, వివోఏ శంకర్, మారి సంస్థ ప్రతినిధులు కరుణాకర్, మహేశ్వరి, ప్రశాంత్, శిక్షణ పొందిన మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పట్టుదలతో చదివి వైద్య విద్యలో సీటు సాధించిన దివ్యశ్రీ

అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్,:



మహమ్మదాబాద్ మండలం నంచర్ల బోరింగ్ తండాకు చెందిన నేనావత్ దివ్యశ్రీ నీట్‌లో ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్ సీటు సాధించారు. నీట్ పరీక్షలో మంచి మార్కులు సాధించిన ఆమెకు మెరుగైన ర్యాంకు లభించింది. కౌన్సెలింగ్ ప్రక్రియలో వనపర్తి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు కేటాయించారు. దివ్యశ్రీ తండ్రి ఎన్.గోపాల్, తల్లి ఎన్.వందన. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని పట్టుదలతో చదివి వైద్య విద్యలో సీటు సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. చిన్ననాటి నుంచే చదువుపై ఆసక్తి పెంచుకుని లక్ష్యసాధన దిశగా కృషి చేసిన దివ్యశ్రీ, నీట్‌లో మంచి ప్రతిభ కనబరిచి వైద్య విద్యలో ప్రవేశం పొందడం పట్ల గ్రామంలో ఆనందం నెలకొంది. దివ్యశ్రీ ఎంబీబీఎస్ సీటు సాధించిన విషయం తెలుసుకున్న గ్రామంలోని పలువురు నాయకులు ఆమెను అభినందించారు. భవిష్యత్తులో వైద్యరంగంలో ఉన్నత స్థాయికి ఎదిగి, పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. దివ్యశ్రీ విజయం గ్రామంలోని ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

## అడవిలో వెలసిన ఆంజనేయ స్వామిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్న భక్తులు



**మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి**

గండీడ్, సెప్టెంబర్ 5:

గండీడ్ మండలం కొంరెడ్డిపల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో వెలసిన ఆంజనేయ స్వామిని భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా భక్తులు కోరిన కోరికలు నెరవేరాలని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆంజనేయ స్వామిని ప్రార్థించారు. అటవీ ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎం. శ్రీనివాస్ రెడ్డి, ఉపసర్పంచ్ జంగళ్ల భీమయ్య, మొరంబాయి శ్రీనివాస్ రెడ్డి, బోయిని శ్రీనివాస్, అనంతయ్య, బి. అంజిలయ్య, జిల్కరి రాములు, ఎం. బాలరాజు, కొండయ్య, ఎర్పుల మైసయ్య, డి. రామకృష్ణ రెడ్డి, వెంకటయ్యతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

## కాటమయ్య బోనాల ఉత్సవాలలో టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) ఆమనగల్ మండలం ఆకుతోటపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించిన కాటమయ్య బోనాల పండుగ ఉత్సవాల్లో పాల్గొన్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ – సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఈ సందర్భంగా కాటమయ్య స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొనారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ,తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కాటమయ్య స్వామిని ఆకాంక్షించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో, గ్రామ సర్పంచ్ న్యాలపట్ల నరేందర్ రెడ్డి,సీనియర్ నాయకులు కొప్పుల శేఖర్ గౌడ్, వీరేష్ గౌడ్, రాజశేఖర్ , చందు,ప్రవీణ్,వెంకట రమణ, లతో పాటు యువత, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ గెల్వలాంబ మాత బ్రహ్మోత్సవాల్లో భక్తిశ్రద్ధలతో వెండి ఖడ్గం సమర్పణ

**అమ్మవారిని దర్శించుకున్న మాజీ సర్పంచ్ గణేష్ రావు కుటుంబ సభ్యులు**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

వంగూర్ మండలంలో నిర్వహిస్తున్న శ్రీ శ్రీ గెల్వలాంబ మాత బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తులు తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ సందర్భంగా వంగూర్ మాజీ సర్పంచ్ వేనేపల్లి గణేష్ రావు దంపతులు అమ్మవారికి ప్రత్యేక కానుకగా రూ.50,000 విలువైన వెండి ఖడ్గాన్ని సమర్పించారు. ఆలయానికి చేరుకున్న గణేష్ రావు దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వెండి ఖడ్గాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శ్రీ శ్రీ గెల్వలాంబ మాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రతి సంవత్సరం మరింత వైభవంగా నిర్వహించాలని కోరుకున్నారు.

వెండి ఖడ్గం సమర్పించిన వేనేపల్లి గణేష్ రావు దంపతులను ఆలయ నిర్వాహకులు, భక్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి గర్జనలో ప్రసంగించిన బిఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జూపల్లి భాస్కర్‌రావు

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి పట్టణ కేంద్రంలో నిర్వహించిన విద్యార్థి గర్జన కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలు, హక్కులపై నినాదాలు చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, వెల్దండ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు పాల్గొని విద్యార్థి గర్జనను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఆయన కోరారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, ఉన్నత విద్యను అభ్యసించే వారికి అవకాశాలు మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి రావాలని, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని, ప్రజాస్వామ్య పద్ధతిలో తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని జూపల్లి భాస్కర్‌రావు పిలుపునిచ్చారు. విద్యార్థి, యువత సమస్యల పరిష్కారం కోసం తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, యువత, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి పై చదువులకు అండగా సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

వెల్దండ మండల కేంద్రానికి చెందిన గుద్దేటి శేఖర్ అలివేల దంపతుల కూతురు సరిత నీట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనభర్చి నీట్ సీటు సాధించిన విద్యార్థిని పాటు తల్లిని గ్రామపంచాయతీ ఆవరణంలో శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా స్వీట్లు తినిపించి ఉన్నంత స్థాయికి ఎదగాలని సర్పంచ్ మట్ట యాదమ్మ మట్ట వెంకటయ్య గౌడ్ అన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ, గుద్దేటి సరితను ఆదర్శంగా తీసుకొని ప్రతి విద్యార్థి లక్ష్యంతో కష్టపడి చదివితే ఉన్నత విజయాలు సాధించవచ్చు అని సర్పంచ్ మట్ట యాదమ్మ మట్ట వెంకటయ్య గౌడ్ అన్నారు అనంతరం విద్యార్థిని పై చదువుకొరకు సర్పంచ్ మట్ట యాదమ్మ మట్ట వెంకటయ్య గౌడ్ అనంతరం 5000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్ర శ్రీను వార్డు నెంబర్ సభ్యులు గుద్దేటి కిష్టాల్ పురుషోత్తం చారి రమేష్ రాఘవరెడ్డి కొండల్ పాలాది మల్లేశ్వరి రిటైర్డ్ ఆర్మీ శ్రీనివాసులు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మంగళగిరి శ్రీను గ్రామపంచాయతీ సిబ్బంది లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు

## ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో జర్మనీ టెక్నాలజీ తో ప్రజలకు స్వచ్ఛమైన త్రాగు నీరు

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

వెల్దండ మండలంలోనీ కుందారం తండా గ్రామంలో తాగునీటి నిల్వ ట్యాంకులను శాస్త్రీయ పద్ధతిలో పరిశుభ్రపరిచి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన, నాణ్యమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో అందుబాటులోకి తీసుకువచ్చిన జర్మన్ సాంకేతికతతో కూడిన ప్రత్యేక యంత్రాల సహాయంతో గ్రామాల్లోని తాగునీటి నిల్వ ట్యాంకులను శాస్త్రీయ పద్ధతిలో శుభ్రపరుస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ట్యాంకుల్లో కొంతకాలంగా పేరుకుపోయిన మురికి, వ్యర్థాలు, ఇతర అవశేషాలను ప్రత్యేక యంత్రాల ద్వారా తొలగించి ట్యాంకులను పరిశుభ్రంగా మార్చారు. అనంతరం ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. తాగునీటి నిల్వ ట్యాంకుల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల నీటి నాణ్యత మెరుగుపడటంతో పాటు ప్రజల ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రపరచడం ద్వారా నీటి కాలుష్యాన్ని నివారించవచ్చని, ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో , సర్పంచ్ గన్యా నాయక్, ఉప సర్పంచ్ , అనిత జంగ్ ,మరియు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. తాగునీటి ట్యాంకుల పరిశుభ్రతను నిరంతరం కొనసాగించాలని గ్రామస్తులు కోరారు.

# నెల రోజులకే పగుళ్లు.. ఎన్ఆర్ఈజీఎస్ సీసీ రోడ్లపై ఆరోపణలు

**రూ.10 లక్షల పనుల్లో నాణ్యతపై అనుమానాలు**

**అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు**

**అగ్నిధార న్యూస్ మంథని :**

మంథని మండలం ఖాన్‌సాయిపేట గ్రామపంచాయతీ పరిధిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లపై నాణ్యతపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిర్మాణం పూర్తయి నెల రోజులు కూడా గడవకముందే రెండు సీసీ రోడ్లు పగుళ్లు బారడంతో పనుల నాణ్యతపై గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.ఒక్కో సీసీ రోడ్డుకు రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.10 లక్షల వ్యయంతో పనులు చేపట్టినట్లు సమాచారం. అయితే నాసిరకమైన మెటీరియల్ వినియోగం, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే రోడ్లు ఇలా పగుళ్లు బారుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ నిధులు దుర్వినియోగమయ్యాయనే ఆరోపణలు వ్యక్తమవు తున్నాయి.

**తీర్మానం చేసిన చోట కాకుండా మరోచోట నిర్మాణం :**

గ్రామపంచాయతీ పాలకవర్గం తీర్మానం ప్రకారం ఎస్సీ కాలనీ నుంచి పోచమ్మ గుడి, స్మశాన వాటిక వరకు సీసీ రోడ్డు నిర్మించాల్సి ఉండగా, అందుకు భిన్నంగా అవసరం లేని ప్రాంతంలో రోడ్డు నిర్మాణం చేపట్టారని బిఆర్ఎస్ ఖాన్‌సాయిపేట గ్రామశాఖ అధ్యక్షుడు కుడుదుల వెంకటేష్ ఆరోపించారు. అంతేకాకుండా గ్రామపంచాయతీ కార్యాలయం, పాఠశాల ముందు ఇప్పటికే ఉన్న సీసీ రోడ్డుపైనే మళ్లీ సీసీ రోడ్డు వేసినట్లు ఆయన పేర్కొన్నారు.

**ఇంజనీర్ పర్యవేక్షణ ఏది.?**

నిర్మాణ సమయంలో సంబంధిత ఇంజనీర్ క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించలేదని, గ్రామపంచాయతీ తీర్మానం లేకుండానే పనులు చేపట్టినట్లు ఆరోపణలు ఉన్నాయని వెంకటేష్ తెలిపారు. పనుల నాణ్యత, అంచనాలు, ఉపయోగించిన మెటీరియల్, నిర్మాణ విధానంపై అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.నెల రోజులకే పగుళ్లు బారిన సీసీ రోడ్లను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పనులు చేపట్టినట్లు తేలితే బాధ్యులైన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని,ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని కుడుదుల వెంకటేష్ కోరారు.



# ఏపీ నీటి దోపిడీకి రేవంత్ సర్కార్ సహకారం: కేటీఆర్ ధ్వజం

**హైదరాబాద్ :** కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) శ్రీశైలం ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తిని తక్షణమే నిలిపివేయాలని జారీ చేసిన ఆదేశాలు తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు కోలుకోలేని గొడ్డలిపెట్టు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేఆర్ఎంబీ నిర్ణయం కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనానికి, నిర్లక్ష్యానికి స్పష్టమైన నిదర్శనమని మండిపడ్డారు. ఎల్‌నినో పేరు చెప్పి కేఆర్ఎంబీ తెలంగాణ హక్కులను కాలరాస్తుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం నోరుమెదపకపోవడం దారుణమన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏ నిబంధనల ప్రకారం, ఏ హక్కుతో వెలిగొండ ప్రాజెక్టుకు చట్టవిరుద్ధంగా నీటిని తరలిస్తోందో చెప్పాలని నిలదీసిన కేటీఆర్, ఏపీ నీటి దోపిడీ బోర్డు కళ్లకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు.అక్కడ ఏపీ ప్రభుత్వం తన రాష్ట్ర ప్రయోజనాల కోసం దర్జాగా వెలిగొండకు నీటిని తరలిస్తుంటే, ఇక్కడ తెలంగాణలోని రేవంత్ సర్కార్ మాత్రం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పంపులను మూసివేసి ఏపీకి సహకరిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి తన అసమర్థ పాలనతో శ్రీశైలం, నాగార్జున సాగర్ రిజర్వాయర్లను ఏపీకి దారాదత్తం చేశారని ధ్వజమెత్తారు. విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేస్తే నాగార్జున సాగర్ ఎడమ కాలువ, కల్వకుర్తి, జూరాల, నెట్టెంపాడు, భీమా ఎత్తిపోతల పథకాల కింద రైతుల పొలాలు ఎండిపోవడమే కాకుండా, బోర్ల కింద వ్యవసాయం చేసే రైతులకు కరెంట్ అందక తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.శ్రీశైలంలో ఆగస్టు 21న 169 టీఎంసీలుగా ఉన్న నీటి నిల్వలు కేవలం 15 రోజుల్లోనే 139 టీఎంసీలకు పడిపోవడంపై స్పందిస్తూ, ఈ వ్యవధిలోనే 30 టీఎంసీల నీరు ఎలా మాయమయ్యిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కల్వకుర్తి వద్ద కేవలం మూడు మోటార్లు మాత్రమే నడుస్తున్నాయని, కృష్ణా జలాలను ఏపీ యథేచ్ఛగా తరలిస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వంలో చలనం కరవైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, రైతాంగానికి చేస్తున్న ద్రోహాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగట్టి తీరతామని కేటీఆర్ హెచ్చరించారు



**ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ యువతకు స్కిల్ లేదనడానికి రేవంత్ రెడ్డికి ఏ అర్హత ఉందని, ఆయన స్వయంగా ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేసిన మోసాలపై బీఆర్ఎస్ నిర్వహించిన 'యువభేరి' సభలో పాల్గొన్న కేటీఆర్, కేవలం లక్కీ లాటరీ తగలడం వల్లే రేవంత్ సీఎం అయ్యారని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీనే గడగడలాడించిన తెలంగాణ యువశక్తికి రేవంత్ రెడ్డి ఓ లెక్కే కాదన్నారు. ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్ పేరిట పెద్ద పెద్ద మాటలు చెప్పిన కాంగ్రెస్ నేతలు, అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు ఇవ్వడం మానేసి లూటీఫికేషన్‌లు నడుపుతున్నారని మండిపడ్డారు.ఎమ్మెల్యే పదవికి కేసీఆర్ రాజీనామా చేయాలంటున్న కాంగ్రెస్ నేతలకు కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన కేసీఆర్ రాజీనామా చేయాలా, లేక ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను వంచించిన రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలా అని ప్రశ్నించారు. ప్రజలకు చేసిన 420 రకాల మోసాలకు గానూ రేవంత్ రెడ్డి 420 సార్లు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేవలం ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదని, త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులు రాబోతున్నాయని హెచ్చరించారు. మంత్రులు కమిషన్ల కోసం కొట్టుకుంటున్నారని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తమ ప్రభుత్వం 2.32 లక్షల ఉద్యోగాలు ఇస్తే, ఈ వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ ఇచ్చినవి కేవలం 16 వేల ఉద్యోగాలేనని చెప్పారు. ఉద్యోగాల కల్పనపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

# ఉపాధ్యాయుల మాట వినండి..

**జీవితానికి బంగారు బాట వేసుకోండి**

**గంజాయి సమాచారం కోసం 1908..**

**సైబర్ మోసాలకు 1930.. అత్యవసర పరిస్థితుల్లో 112**

**గోదావరిఖని :** విద్యార్థులు ఉపాధ్యాయుల మాటకు గౌరవం ఇస్తూ,వారి సూచనలు పాటించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు.చెడు వ్యసనాలకు, ముఖ్యంగా గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి జోన్‌లోని ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఎన్టీపీసీ టీటీఎస్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఉపాధ్యాయ దినోత్సవ ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రామగుండం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణకుమార్,సైబర్ నేరాల విభాగం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో తల్లిదండ్రులే తొలి గురువులని,వారి తర్వాత ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులు జీవితంలో ఏ స్థాయికి ఎదిగినా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఎల్లప్పుడూ గౌరవించే మనస్తత్వాన్ని కలిగి ఉండాలని సూచించారు. చదువు,వ్యక్తిగత జీవితం లేదా ఇతర అంశాలకు సంబంధించి ఏవైనా సమస్యలు, సందేహాలు ఉంటే వాటిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో పంచుకోవాలని తెలిపారు. సమస్యలను మనసులో దాచుకోకుండా వారితో మాట్లాడితే సరైన మార్గనిర్దేశం లభిస్తుందని అన్నారు.విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం వారి భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గంజాయి విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 1908కు తెలియజేయాలని సూచించారు.సైబర్ నేరాల విషయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే అనుమానాస్పద లింకులను తెరవకూడదని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ వంటి సమాచారాన్ని ఎవరికీ వెల్లడించకూడదని తెలిపారు.సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు, ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు లేదా ఇతర ఆపద సమయాల్లో పోలీసుల సహాయం కోసం 112కు కాల్ చేయాలని విద్యార్థులకు వివరించారు. గతంలో అందుబాటులో ఉన్న 100 నంబర్ స్థానంలో ప్రస్తుతం 112 అత్యవసర సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.విద్యార్థుల భద్రత కోసం పోలీసు అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని సీపీ పేర్కొన్నారు. ఏసీపీలు,సీఐలు, ఎస్‌హెచ్‌ఓలు పాఠశాలల పరిసరాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ భద్రతా పరిస్థితులను పరిశీలిస్తున్నారని తెలిపారు.అయితే విద్యార్థులే తమ భద్రతకు తొలి రక్షకులని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం


## విద్యుత్ షాక్‌తో మేక మృతి



**అగ్నిధార న్యూస్‌గండీడ్, సెప్టెంబర్ 5**

మండల పరిధిలోని మన్సూర్‌పల్లి గ్రామానికి చెందిన ఎదుల బుగ్గన మేక విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. బుగ్గన మేకలను మేతకు తీసుకెళ్లగా, అంతర్ గంగాగుట్ట సమీపంలోని సల్కర్‌పేట్ గ్రామానికి చెందిన బొంబాయి బాబు పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర మేక మేతకు వెళ్లి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు మేకల కాపరి బుగ్గన తెలిపారు. మృతి చెందిన మేక విలువ సుమారు రూ.20 వేల వరకు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి బాధితుడికి తగిన సహాయం అందించాలని బుగ్గన కోరారు.

## శ్రీ శ్రీ శ్రీ తిరుమలనాథ స్వామి వృషభాల బండ్ల ఊరేగింపు



**అగ్నిధార న్యూస్‌మహమ్మదాబాద్ సెప్టెంబర్ 05**

మండల పరిధిలోని జూలపల్లి గ్రామంలోని చింతగట్టు పై దాదాపు 500 సంవత్సరాల క్రితం వెలసిన శ్రీ శ్రీ శ్రీ తిరుమలనాథ స్వామివారి వృషభాల బండ్ల ఊరేగింపును శనివారం గ్రామ.సర్పంచ్ జి.పద్మ గ్రామ పెద్దలు ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసంలోని చివరి శనివారం సందర్భంగా ప్రతి సంవత్సరం ఈ ప్రత్యేక ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.పూర్వం నుంచి పెద్దలు పాటిస్తూ వస్తున్న ఆచార సంప్రదాయాలను కొనసాగిస్తూ స్వామివారి వృషభాల బండ్ల ఊరేగింపును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకలకు మండలంలోని దేశాయపల్లి గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.స్వామివారికి అత్యంత ప్రీతికరమైన హుండ్రాళ్ల పాయశం ప్రత్యేకతగా నిలుస్తోంది. ఆనాటి నుంచి పెద్దలు ఈ ఆచారాన్ని కొనసాగిస్తూ వస్తున్నారని గ్రామస్తులు తెలిపారు.ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## సింగరేణి ఉనికికే పెను ప్రమాదం



**కాంగ్రెస్ అవినీతిపై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజం**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం) :**

కాంగ్రెస్ నాయకుల అవినీతి, రాజకీయ జోక్యంతో చారిత్రక సింగరేణి సంస్థ ఉనికికే ముప్పు పొంచి ఉందని మాజీ మంత్రి, టిబిజికెఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. శనివారం రాత్రి గోదావరిఖనిలోని టిబిజికెఎస్ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సింగరేణి పరిరక్షణ సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు.సింగరేణిలో తమ అనుయాయులకు కాంట్రాక్టులు కట్టబెట్టి నిధుల దుర్వినియోగానికి పాల్పడేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న సింగరేణిని పరిరక్షించాల్సిన బాధ్యత బీఆర్ఎస్, టిబిజికెఎస్‌పై ఉందన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీఆర్ఎస్ శ్రేణులు గనుల్లో పర్యటిస్తూ కార్మిక సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. అవసరమైతే కార్మికుల హక్కుల కోసం పెద్దఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, కార్పొరేషన్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ మేకల సమ్మయ్య, టిబిజికెఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామ్మూర్తి, సీనియర్ ఉపాధ్యక్షుడు నూనె కొమరన్న, అధికార ప్రతినిధి పార్లపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి సందర్భంగా రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

**అగ్నిధార న్యూస్ మంథని :**



రాబోయే వినాయక చవితి పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా మంథని పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మంథని పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లకు శనివారం పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు.పండుగ సమయంలో నేరాలకు పాల్పడటం, గొడవలు సృష్టించడం, బలవంతపు చందాలు వసూలు చేయడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, గుంపులు ఏర్పాటు చేసి శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం వంటి చర్యలకు పాల్పడవద్దని పోలీసులు కఠినంగా హెచ్చరించారు. స్టేషన్ పరిధి విడిచి వెళ్లాల్సి వస్తే ముందుగా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.వినాయక చవితి పండుగ బందోబస్తులో భాగంగా బీట్ చెకింగ్, నైట్ రౌండ్స్, ప్రత్యేక పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసి నిరంతరం నిఘా కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.ప్రజలు వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో, సోదరభావంతో జరుపుకోవాలని పోలీసులు కోరారు. ఏదైనా సమస్య తలెత్తినా, అనుమానాస్పద పరిస్థితులు కనిపించినా వెంటనే మంథని పోలీసులను సంప్రదించాలని సూచించారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com